

కూలి డబ్బులు

ఒక ఊళ్లో భీమన్న అనే కుర్రాడుండేవాడు. వాడికి చిన్నతనంలోనే తల్లీ, తండ్రీ పోవటం చేత వాణ్ణి బామ్మ గారాబంగా పెంచి పెద్ద చేసింది. భీమన్నకు తెలివి తేటలూ, లోక జ్ఞానమూ కొంచెంకూడా లేవు, కాని వాడిది అంతులేని బలం. వాణ్ణి అందరూ గుండు భీమన్న అని పిలిచేవాళ్ళు. వాడికి కొంచెం కూడా చదువు రాలేదు. అటువంటి వాడు గాలికి తిరిగేకన్న ఎక్కడైనా పనికి కుదిరితే కాస్త బాగుపడతాడనే ఉద్దేశంతో బామ్మ వాణ్ణి వెళ్ళి ఎక్కడైనా పని చూసుకో మని చెప్పింది.

పనికోసం వెళ్లినప్పుడు ఎలా మసులు కోవాలో బామ్మ గుండు భీమన్నకు ఈ విధంగా బోధించింది: "మాట్లాడక పని చేసి, పోట్లాడక కూలి పుచ్చుకో. అలా చేసే వాళ్ళనే లోకం మంచి వాళ్లుగా తలుస్తుంది. చేసే పని బాగా చెయ్యి, పుచ్చుకునే డబ్బు చేతినిండా పుచ్చుకో. నే చెప్పిన మాటలు మరిచిపోవు గద!"

బామ్మ చెప్పిన సలహా వాక్యాలు మననం చేసుకుంటూ గుండు భీమన్న పని కోసం ఊరి వెంట బయలుదేరాడు. దారిలో ఒక ఇంటి ముందు వాడికొక పెద్ద మనిషి కన పడ్డాడు. వాడు ఆయనను, "నేను పనికోసం వెతుకుతున్నాను. నాకు మాట్లాడక పనీ, పోట్లాడక కూలీ ఇచ్చేవాళ్ళు కావాలి. ఎవ రన్నా ఉంటే చూపిస్తారా?" అని అడిగాడు.

గుండు భీమన్నకు తెలివితేటలు శూన్య మని తెలిసిపోయింది. ఆయన వాడికి ఒక తొండను చూపించి, "అదుగో, అది నిన్ను మాట్లాడక పనికి రమ్మని పిలుస్తున్నది. అది చెప్పిన పని చేసి పోట్లాడక కూలి డబ్బులు పుచ్చుకో!" అన్నాడు.

గుండు భీమన్న తొండ కేసి చూశాడు. అది మాటాపలుకూ లేకుండా తల పైకీ,

కిందికి అడించటం వాడికి కనిపించింది. అది నిజంగా తనను పిలుస్తున్నదనుకుని వాడు దాన్ని సమీపించాడు. అది భయపడి సమీపంలో ఉండే కలుగులోకి దూరింది.

"ఇది దాని ఇల్లు కాబోలు. అది అయితే లోపలికి సులువుగా వెళ్ళిందిగాని ఈ ఇంటి వాకిలి మరీ చిన్నదిగా ఉందే, నే నెలా పట్టటం?" అనుకున్నాడు గుండు భీమన్న.

వాడు ఆ కలుగు గుర్తు పెట్టుకుని వెళ్ళి ఒక గునపం తెచ్చి కలుగును తవ్వి పెద్దది చెయ్యసాగాడు. అలా చీకటి పడేదాకా తవ్వి పెద్ద గొయ్యి చేశాడు. ఆ గోతి అడుగున వాడికొక భాండం దొరికింది. అందులోకి చెయ్యి పెట్టేసరికి బంగారు కాసులు తగిలాయి.

"ఓహో, నేను చెయ్యవలిసిన పని అయిపోయింది కాబోలు, నాకు డబ్బిచ్చేస్తున్నారు," అనుకున్నాడు వాడు. వాడికి బామ్మ ముందే చెప్పింది. పని బాగా చేసి చేతినిండా డబ్బు తెచ్చుకోమని. అందుకని వాడు పట్టెడు బంగారం కాసులు తీసుకుని మిగిలిన బంగారం అక్కడే వదిలేసి ఇంటికి పోయాడు. వాడు తెచ్చిన బంగారం చూసి బామ్మ నిర్ఘాంతపోయి, "ఇంత బంగారం నీ కెక్కడిదిరా?" అని అడిగింది.

గుండు భీమన్న బామ్మకు జరిగినదంతా చెప్పాడు. అంతా విని ఆవిడ, "ఓరి, వెర్రి కుంకా! ఏదీ ఆ చోటు ఎక్కడో నాకు చూపించు!" అన్నది.

చీకట్లో భీమన్న ఆవిడను తాను తవ్విన చోటికి తీసుకుపోయాడు. ఆవిడ వాడిచేత భాండం పైకి తీయించి, ఇంటికి పట్టించుకు వచ్చి, "ఈ డబ్బు సంగతి ఎక్కడా ఎత్తకు, తెలిసిందా? నీ పెళ్ళికి ఇదంతా ఖర్చు చేద్దాం. అంతదాకా నేను దీన్ని జాగ్రత్తగా దాచి ఉంచుతాను," అన్నది. గుండు భీమన్న తల ఆడించి, సరే నన్నాడు.

[పై మాసం మరొక సంఘటన]






చచ్చిబతికిన సన్యాసి

మర్నాడు బామ్మ గుండు భీమన్నతో, "ఒరే, నాయనా, నిన్న నీకు పని యిచ్చినవాడు చాలా చెడ్డవాడు. అటువంటివాళ్ళ దగ్గిరికి పోకు. ఎవరన్నా ముసలి సాధువులకు సేవ చేస్తే భుక్తి, ముక్తి ఉంటుంది. వాళ్ళ సంపర్కంవల్ల నీకింత జ్ఞానంకూడా కలుగుతుంది," అన్నది.

భీమన్న ఇల్లు కదిలి ముసలి సాధువు ఎవరన్నా కనిపిస్తాడా అని వెతుక్కుంటూ బయలుదేరాడు. ఒకచోట వాడికి ఒక గుడ్డి బిచ్చగాడూ, వాణ్ణి నడిపించే కుర్రాడూ కనిపించారు. బిచ్చగాడి కుర్రాడు భీమన్నను పలకరించి వాడి ఉద్దేశం తెలుసుకుని, "ఈ గుడ్డిమనిషి గొప్ప సాధువు. నే నింత కాలమూ ఈయనకు సేవచేసి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. కావలిస్తే నా బదులు నీవే ఈయనకు సేవ చెయ్యవచ్చు. నేను ఎక్కడికైనా పోయి మరొక పని చూసుకుంటాను," అన్నాడు. గుండు భీమన్న సంతోషించి, సరేనన్నాడు. బిచ్చగాడి శిష్యుడు భీమన్నను బిచ్చగాడికి వప్పగించి, "ఇక నుంచీ వీణ్ణి శిష్యుడుగా పెట్టుకో. నేను పోతున్నాను," అని చెప్పి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

బిచ్చగాడు భీమన్నకు వాడి విధులన్నీ వివరంగా చెప్పాడు:

"మనం ఇంటింటికీ వెళ్ళి అడుక్కుంటాము. నాకు కళ్ళు కనపడవు గనక నన్ను నువు కర్ర పట్టుకు నడిపించాలి. నువు వెనక తిరిగి చూడనవసరం లేదు. మెరక గాని, పల్లంగాని, నీళ్ళుగాని వచ్చినప్పుడు నాకు చెబితే చాలు. ఇళ్ళన్నీ అడుక్కున్నాక మనం వంటచేసుకు తినాలి. వంట నువే చెయ్యాలి. మళ్ళీ బయలుదేరేటప్పుడు మన సామానంతా సరిగా ఉన్నదీ లేనిదీ నువే చూసుకోవాలి. మన సామాను ఏమిటో



తెలుసా ? బుట్టా, తట్టా, తప్పేలా, చెంబూ, లోటా, గరిటే, కర్రా—అంతే! ఈ జాబితా బాగా కంఠస్థం చేసుకో. నేను చెప్పిన ప్రకారం సేవచేశావంటే మనకు దొరికిన దాన్లో నీకు సగం, నాకు సగం. తెలిసిందా ?"

భీమన్న ఎంతో శ్రద్ధగా బిచ్చగాడు చెప్పినదంతా తల కెక్కించుకున్నాడు. సన్యాసి వద్ద ఒక కర్ర ఉన్నది. దానికి రెండు చివరలా కొంకులున్నాయి. బిచ్చగాడు జోలె భుజాన వేసుకుని కర్ర ఒక చివర పట్టుకు నడుస్తుంటే, తట్ట నెత్తిన పెట్టుకుని భీమన్న కర్ర రెండో చివర పట్టుకుని దారితీశాడు.

ఇద్దరూ నడుస్తూండేటప్పుడు భీమన్న మధ్య మధ్య ఆగి బిచ్చగాణ్ణి గమనిస్తూ వచ్చాడు. బిచ్చగాడు వాడితో, "నువు నా కోసం ఆగవలిసిన పనే లేదు. నీ మానాన నువు ముందు పోతూ ఉండు. ఎక్కడైనా ఎత్తుగాని, పల్లంగాని, నీళ్ళుగాని వస్తే నాకు చెప్పు," అన్నాడు.

భీమన్న అట్లాగే ముందు చూస్తూ నడవ సాగాడు. కొంత దూరం వెళ్ళేసరికి ఒక ఏరు అడ్డం వచ్చింది.

భీమన్న వెనక్కు తిరిగి చూడకుండానే, "నీళ్ళు, గురూ!" అన్నాడు.

"ఎవరన్నా దాటుతున్నారా?" అని బిచ్చగాడు ప్రశ్నించాడు.

ఏటికి అడ్డంగా వస్తున్న ఆవులను చూసి, "ఆవులు దాటుతున్నాయి, గురూ!" అన్నాడు భీమన్న.

"సరే, మనమూ దాటుదాం," అన్నాడు బిచ్చగాడు.

భీమన్న ఏటిలోకి దిగి కొంత దూరం వెళ్ళి, "రాయి, గురూ," అంటూ నీటిలో పడిపోయాడు. ఆ పాటుకు వాడు కొంకుల కర్రను గుంజటంలో బిచ్చగాడు కూడా పడిపోయాడు. వాడి జోలె మాత్రం కొంకికి చిక్కుకున్నది. జోలెలోకి కొన్ని చేపలూ,

ఒక పాముా జొరబడ్డాయి. బిచ్చగాడు ప్రవాహంలో పడి కొట్టుకుపోయాడు.

భీమన్న లేచి తట్ట నీటిలో నుంచి పైకి తీసి, "తట్టా, బుట్టా, తప్పేలా, చెంబూా, లోటా, గరిటే, కర్రా—అంతే!" అని అన్నీ లెక్క చూసుకుని, బిచ్చగాడి కోసం వెనక్కు తిరిగి చూడక, కర్రచివరి కొంకికి చిక్కుకున్న జోలెను ఈడ్చుకుంటూ ఏరు దాటసాగాడు.

దురదృష్టవశాత్తూ జోలెలో చేరిన పాము తల బయటికి పెట్టేసరికి దాని తల కర్ర కొంకెకీ జోలెకీ మధ్య నొక్కుకుపోయి అది కాస్తా చచ్చింది.

భీమన్న నది దాటి జోలెను ఈడ్చుకుంటూ పోతుంటే దారిలో కొందరు, "అయ్యో, పాము, పాము!" అని పెద్దగా కేకలు పెట్టారు.

"పాము కాదు, స్వాములవారు," అని భీమన్న వారికి బదులు చెప్పాడు.

"పామో, స్వామో—వెనక్కు తిరిగి చూడు, నీకే తెలుస్తుంది," అన్నారు వాళ్ళు.

"చూడను, చూడకూడదు! స్వాముల వారి ఆజ్ఞ!" అన్నాడు భీమన్న. వాడి చుట్టూ ఒక గుంపు చేరింది. వాడు కొంచెం ముందుకు పోయి ఒక ఇంటిముందు నిలిచి, "గురూ!" అన్నాడు.



వాడు "గురూ!" అనగానే బిచ్చగాడు, "జై సీతారాం!" అంటాడు. ఇంటివాళ్ళు బిచ్చం వేస్తే వేస్తారు, లేకపోతే పొమ్మంటారు.

ఈ ఏర్పాటు ప్రకారం భీమన్న, "గురూ!" అన్నాడు. కాని బిచ్చగాడు, "జై సీతారాం!" అనలేదు. అప్పుడు వాడు కర్ర రెండో చివరకేసి చూశాడు. వాడికి చచ్చిన పాము కనిపించింది.

అందరూ పకపకా నవ్వి, "ఒరే నీ స్వాములవారు పాములవా రయినారు! వారిని సమాధి చేసెయ్యి!" అన్నారు.

నిజమే ననుకుని భీమన్న ఆ చచ్చిన పామును ఊరిబయట గుంట తవ్వి పూడ్చి పెట్టి, ఆ సమాధివద్ద నాలుగు తులసి మొక్కలు నాటాడు.

ఈలోపల ఏట్లో పడిన బిచ్చగాడు, గట్టి ఆయువు కలవాడు కావటంచేత ఎలాగో ఒడ్డుకు చేరి అక్కడ ఒక చోట కూచుని ఆడుకోసాగాడు.

పాముకు సంస్కారం చేసి అటుగా వస్తున్న భీమన్న వాణ్ణి చూసి, "ఆహా, ఏమి స్వాములవారి మహిమ!" అనుకుని, తన నెత్తిమీద ఉన్న తట్ట దించి, "గురూ, ఇదుగో—తట్టా, బుట్టా, తప్పేలా, చెంబూ, లోటా, గరిటే, కర్రా—అంతే!" అన్నాడు.


బిచ్చగాడు మండిపడి, "దొంగ వెధవా! నన్ను ఏట్లో తోసి మళ్ళీ నా సేవ చేయ వచ్చావా? చూడు నిన్నేం చేస్తానో!" అంటూ అరిచాడు.

భీమన్న పరిగెత్తి ఇంటికి పోయి, బామ్మతో జరిగినదంతా చెప్పి, "నా వల్ల ఏ తప్పూ లేకుండానే స్వాములారు నా మీద మండి పడ్డారు, బామ్మా!" అన్నాడు.

"నువు వట్టి వెర్రివెంగళాయివి! నీకు ఎవరి సేవా వద్దులే. అడివికి పోయి కట్టెలు కొట్టి తెస్తూ ఇంటిపట్టునే పడి ఉండు!" అన్నది బామ్మ.

[పై సంచికలో మరొక సంఘటన]





సందేహ నివృత్తి

గుండు భీమన్న ఉండే గ్రామంలోనే ఒక శ్రీమంతు డుండేవాడు. ఆయన భోజన ప్రియుడు. బోలెడంత డబ్బు ఉన్నది. సంసారం ఏమీ లేదు. అందుచేత ఆయన వంటవాణ్ణి ఒకణ్ణి పెట్టుకుని వాడిచేత రుచి రుచిగా భోజనమూ, ఫలహారాలూ చేయించు కునేవాడు. మూడు పూటలా మస్తుగా తినటమూ, నిద్రపోవటమూ తప్ప ఆయనకు మరొక పనిలేదు.

త్వరలోనే శ్రీమంతుడి వద్ద వంట చేసే వాడికి కూడా తిండి జాస్తి అయి, శరీరం కొవ్వి, సోమరితనం అలవడింది. అందు చేత వాడు తన కింద పనిచేయటానికి మరొక మనిషిని పెట్టుకోవాలని నిశ్చయించాడు.

ఒకనాడు వాడు బామ్మ యింటికి వచ్చి, "ఏమమ్మా, నేను ఫలాని వారింట వంట చేస్తూ ఉంటాను. పై పనులు చెయ్యటానికి కుర్రవాడు కావాలి. మీ ఇంటో ఎవరో ఉన్నాడని చెప్పారు. పనిలోకి వస్తాడా ఏమిటి?" అని అడిగాడు.

బామ్మ గుండు భీమన్నను పిలిచి, "శ్రీమంతుల ఇంట పై పనులు చెయ్యటానికి పోతావుట్రా?" అని అడిగింది. గుండు భీమన్న సరే నన్నాడు. వంటవాడు వాణ్ణి తన వెంట తీసుకుపోయాడు.

శ్రీమంతుడు మధ్యానం భోజనం చేయ గానే పడుకుని నిద్రపోతాడు. మూడు గంట లయేసరికి ఆయనకు ఫలహారం సిద్ధ మవుతుంది. వంటవాడు ఫలహారం తెచ్చి మంచం పక్కన పెడితే ఆయన నిద్రలేచి, ఫలహారం చేసి, మళ్ళీ నిద్రపోతాడు.

ఒక్కొక్కసారి ఆయన మరికొంత సేప టికి లేచి, "నా ఫలహారమూ, పాలూ ఏవిరా?" అని కేక వేస్తాడు. ఎందుకంటే నిద్రమత్తున చేసిన ఫలహారం కావటంచేత ఆయన కది జ్ఞాపకం ఉండదు.



"అప్పుడే తీసుకున్నారు గదండీ ?" అంటాడు వంటవాడు. ఆయన తిన్న ఎంగిలి పళ్ళాలూ, పాల లోటా చూపించినాక గాని శ్రీమంతుడికి నమ్మకం కలగదు.

యజమానికి ఇలాటి అలవాటు ఉండటం చేత వంటవాడు ఆయన ఎంగిలి పళ్లాలూ, లోటా మంచం పక్కనే ఉండనిచ్చేవాడు.

ఇలా కొంతకాలం గడిచాక వంటవాడి కొక దుర్బుద్ధి పుట్టింది. వాడికి కూడా క్రమంగా ఒళ్ళు బరువు హెచ్చుతూ ఉండటం చేత ఒక్కొక్క రోజు ఫలహారం చెయ్యటానికి ఒళ్ళు వంగేదికాదు. అటు వంటప్పుడు వాడు కొన్ని ఎంగిలి పళ్ళాలూ, లోటా తయారుచేసి యజమాని మంచం పక్కన పెట్టేసి, యజమాని మూతికి కొంచెం చక్కెరా నెయ్యీకలిపి రాచి మాట్లాడకుండా ఊరుకునేవాడు.

యజమాని లేచి, "ఫలహారమూ, పాలూ ఏవిరా?" అని అడిగితే, "అప్పుడే ఫలహారం చేశారుగదండీ ?" అని వంటవాడు జవాబు చెప్పేవాడు. యజమాని ఎంగిలి పళ్ళాలు చూసి పెదవులు నాక్కుని, నిజమే కాబోలు నని మళ్ళీ నిద్రపోయేవాడు.

గుండు భీమన్న నౌకరీలోకి వచ్చిన రోజున వంటవాడు ఫలహారం చెయ్యటానికి బద్ధకించాడు. వాడు కొన్ని ఎంగిలి పళ్లాలూ, లోటా తయారుచేసి భీమన్నతో, "ఈ పళ్ళాలూ, లోటా యజమాని మంచం పక్కన పెట్టు. ఈ చక్కెరా నెయ్యీ తీసుకుపోయి యజమాని పెదవుల పైన రాయి. ఆయన గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. లేవడులే, భయంలేదు," అన్నాడు.

"సరే నండి," అని భీమన్న పళ్ళాలూ లోటా పట్టుకుపోయి యజమాని మంచం పక్కన పొట్టిబల్ల మీద ఉంచాడు. కాని నెయ్యీ చక్కెరా ఎలా రాయాలో వాడికి తెలియలేదు. యజమాని పెదవుల పైన రాయమంటాడు వంటవాడు. పెదవుల పైన

మీసాలున్నాయి. మీసాలపైన ముక్కున్నది. మీసాలకు రాయాలా, ముక్కుకు రాయాలా? వంటింటోకి వెళ్ళి అడిగితే వంటవాడికి కోపం వస్తుందేమో!

అందుకని భీమన్న యజమానిని తట్టి నిద్రలేపి, "అయ్యా, దీన్ని మీ పెదవులపైన రాయమన్నాడు వంటవాడు. మీసాలకు రాయమన్నారా? ముక్కుకు రాయమన్నారా?" అని అడిగాడు.

యజమాని నిద్రమత్తునుంచి లేచి, "ఏమిట్రా రాచేది? నా ఫలహారం ఎక్కడరా?" అని అడిగాడు.


"ఫలహారం లేదయ్యా! అందుకే ఈ ఎంగిలి పళ్ళాలూ, లోటా తయారుచేసి మీ మంచం దగ్గిర పెట్టాను. ఈ నెయ్యీ చక్కెరా మీ పెదవులపైన రాయమన్నాడు వంటాయన. పెదవుల పైననేమో మీకు మీసాలున్నాయి. దానికి పైన ముక్కున్నది. దీన్ని మీసాలకు రాయాలో, ముక్కుకు రాయాలో తెలీక తమరినే అడుగుదామని లేపాను," అన్నాడు భీమన్న.

"ఇదంతా ఏమిటి? నాకు కొంచెం కూడా అర్థం కావటంలేదు. ఫలహారం చెయ్యకపోవట మేమిటి? ఎంగిలి పళ్లాలు తెచ్చి మంచం పక్కన పెట్టట మేమిటి?" అని యజమాని చిరాకుపడి అడిగాడు.

"అయ్యా, తమరు నిద్ర లేచి ఫలహారం తెమ్మంటే ఇవి చూపించి, తమరు ఫలహారం చేశారని వంటాయన చెప్పమన్నాడండి," అన్నాడు భీమన్న.

వంటవాడు తనను ఈ విధంగా తరుచు మోసగిస్తున్నాడని యజమానికి స్పష్టంగా తెలిసిపోయింది. ఆయన వంటవాణ్ణీ, గుండు భీమన్ననుకూడా నానా తిట్లూ తిట్టాడు. తరవాత వంటవాడు గుండు భీమన్నను బాగా తన్ని పనిలోనుంచి వెళ్ళగొట్టాడు. గుండు భీమన్న తన దౌర్భాగ్యాన్ని తిట్టుకుంటూ ఇంటికి వెళ్లిపోయాడు.





పళ్లబుట్ట గొడవ

బొమ్మ ఒకనాడు గ్రామాధికారి ఇంటికి వెళ్ళి ఆయనతో తన మనమడి విషయం మొరబెట్టుకున్నది. "మా వాడు బొత్తిగా ఎందుకూ పనికిరాకుండా ఉన్నాడు. వాడికి ఒక్క పని చేతకాదు. ఏం చెయ్యాలో తోచటంలేదు," అన్నదావిడ.

"నీ కెందుకు, వాణ్ణి మా ఇంట కొద్ది రోజులుంచు. వాడికి అన్ని పనులూ చక్కగా నేర్పుతాను," అన్నాడు గ్రామాధికారి. సరే. ఇంకేం, భీమన్న గ్రామాధికారి ఇంటికి వచ్చి పనిచెయ్యటం ప్రారంభించాడు. అదేం ప్రారబ్ధమో వాడు చెప్పిన పని చెప్పినట్టు చేసికూడా చివాట్లు తినేవాడు. దీనికి కారణం వాడి అశ్రద్ధ కాదు; వాడికి సొంతంగా ఆలోచించే టందుకు బుర్రలేదు. అలాగే వాడు గ్రామాధికారి ఏ ఊరుపోతే ఆ ఊరల్లా తానుకూడా పోతూ కొన్నాళ్ళు పనిచేశాడు.

ఒకనాడు గ్రామాధికారి భీమున్ని పిలిచి, "ఏటి అవతల మొన్న మనం వెళ్ళివచ్చామే ఆ గ్రామానికి వెళ్ళి అక్కడ ఉండే మన కాపు సుబ్బయ్యకు ఈ ఉత్తరం ఇచ్చిరా," అని చెప్పాడు.

భీమన్న ఆ జాబు తీసుకుని ఆ గ్రామానికి ప్రయాణం చేసి కాపు సుబ్బయ్యకు దాన్ని ఇచ్చి ఇంటికి తిరుగు ప్రయాణమైనాడు. ఆ సమయంలో కాపు భీమన్నకు ఒక పళ్ళబుట్ట యిచ్చి, "ఇందులో యాభై అరటి పళ్ళున్నాయి. అవి త్వరలోనే పండుతాయి. పండినప్పు డవి ఎర్రగా అవుతాయి. ఎర్రగా అయిన తరవాత వాటిని నిలవ ఉంచటం మంచిదికాదు. వెంటనే తినాలి," అని చెప్పాడు.

భీమన్న పళ్ళబుట్ట తీసుకుని బయలుదేరాడు. వాడు నది దగ్గిరికి వచ్చేసరికి ప్రవాహం జాస్తిగా ఉన్నది. ఆ రోజు నది

దాటటం సాధ్యపడలేదు. మర్నాడు భీమన్న నది దాటి బుట్టలో పళ్లకేసి చూసుకున్నాడు. అవి ఎర్రగా ఉన్నాయి. పళ్ళు ఎర్రబడ్డాక నిలవ ఉంచరాదనీ, వెంటనే తినాలనీ కాపు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి భీమన్న కష్టపడి యాభై అరటి పళ్ళూ తినేసి, ఖాళీబుట్ట తీసుకుని ప్రయాణం పూర్తిచేసి గ్రామాధికారి ఇల్లు చేరుకున్నాడు.

"వెళ్ళిన పని అయిందా? చీటీ సుబ్బయ్యకు ఇచ్చావా?" అని గ్రామాధికారి అడిగాడు.

"ఇచ్చాను. ఇదుగో బుట్ట. సుబ్బయ్య మీ కివ్వమన్నాడు," అంటూ భీమన్న ఖాళీ బుట్ట గ్రామాధికారి ఎదట పెట్టాడు.

"ఈ ఖాళీబుట్ట దేనికిచ్చాడూ?" అని గ్రామాధికారి ఆశ్చర్యంతో అడిగాడు.

"ఖాళీబుట్ట ఇవ్వలేదు. అందులో యాభై అరటిపళ్ళు పెట్టి, వాటిని ఎర్రబడగానే తినాలనీ, నిలవుంటే చెడిపోతాయనీ చెప్పాడు. నేను ఏరుదాటి చూస్తే పళ్ళు ఎర్రబడ్డాయి. నిలవుంటే చెడిపోతాయని అన్నీ తిన్నాను," అన్నాడు భీమన్న.

గ్రామాధికారికి మండిపోయింది. ఆయన భీమన్నను నానా చివాట్లూ పెట్టి, "నీ మొహం నాకు చూపించకు, వెళ్ళిపో," అని ఇంటికి పంపేశాడు.


బామ్మ వాణ్ణి చూస్తూనే ఏదో జరిగిందని గ్రహించింది. జరిగినదంతా విన్నాక ఆవిడ నిరాశతో, "ఓరి వెధవా! నీ కింక ఈ జన్మలో బుద్ధిరాదు," అన్నది.

"మరి ఏ జన్మలో బుద్ధి వస్తుంది?" అని భీమన్న అడిగాడు.

"ఇంకొక జన్మ ఎత్తాలి," అన్నది బామ్మ.

"ఇంకొక జన్మ ఎప్పుడు ఎత్తుతాను?" అన్నాడు భీమన్న.

"చచ్చినాకనే ఇంకో జన్మ! నువ్వు పని చెయ్యటం చాల్లే. ఇల్లు కదలకు!" అన్నది బామ్మ. [పై సంచికలో మరొక సంఘటన]





చేతగాని ఆత్మహత్య

బొమ్మ చెప్పింది—తనకి జన్మలో బుద్ధి రాదు. ఇంకో జన్మ ఎత్తాలి. ఇంకో జన్మ ఎత్తాలంటే ముందు చావాలి. అందుచేత గుండుభీమన్న చావు కోసం ఎదురు చూడ సాగాడు. అది ఎప్పుడు వస్తుందో, ఎలా వస్తుందో, అది మాత్రం వాడికి తెలీదు.

ఒకనాడు వాడు కట్టెలకోసం దారి పక్కనున్న చెట్టు ఒకటి ఎక్కి, మంచి కొమ్మ ఒకటి చూసుకున్నాడు. దానిని కొట్టాలంటే నిలబడటానికి వీలయిన చోటేది వాడికి కనిపించలేదు. అందుచేత వాడు ఆ కొమ్మమీదనే ఎక్కి దాన్ని కొట్టనారంభించాడు. ఆ సమయంలో దారి వెంబడి వెళ్ళే ఒక ముసలివాడు గుండు భీమన్నను చూసి, "అదేం పనిరా, అబ్బీ! కిందపడి పోతావు!" అని హెచ్చరించాడు.

"నాకు చెట్టెక్కటం చాత కాదనుకున్నావా? కొమ్మలు కొట్టటం చాత కాదనుకున్నావా? పడిపోతానని చెప్పటానికి నీకేమన్నా దివ్యదృష్టి ఉన్నదా? పదవయ్యా, పద!" అంటూ ముసలివాణ్ణి కోప్పడి, గుండుభీమన్న కొమ్మను కొట్ట సాగాడు.

కొద్ది సేపట్లోనే కొమ్మ విరిగిపడింది. దానితోపాటు భీమన్న కూడా పడ్డాడు. అయితే అదృష్టవశాత్తూ కొమ్మ ఒక్కసారిగా విరిగిపడక నింపాదిగా ఒరగటంవల్ల గుండు భీమన్నకు దెబ్బలేమీ తగలలేదు.

కాని వాడికి ముసలివాడి మీద మాత్రం గురి కుదిరింది. ఆ ముసలివాడు మంచి జ్ఞాని అయిఉండాలి; అందుకే జరగబోయేది అంత సరిగాచెప్పాడు! గుండు భీమన్న పరిగెత్తుకుంటూ వెళ్ళి ముసలాయనను కలుసుకుని, "అయ్యా, నన్ను మన్నించండి. మీరు త్రికాల వేదులన్నది తెలియక, నోటికి వచ్చినట్లు మాట్లాడి, మీకు అపచారం చేశాను. మీ రన్నట్టుగానే నేను



కిందపడి పోయాను," అన్నాడు, ఆయన ముందు సాష్టాంగపడి.

"నేను విశేషం ఏమీ చెప్పలేదులే, నాయనా. లే, లే!" అంటూ ముసలివాడు గుండుభీమన్నను లేవదీయ బోయాడు.

"మీకు సమస్తమూ తెలుసు! నే నెప్పుడు చచ్చిపోతానో చెప్పిన దాకా నేను మీ కాళ్ళు విడవను!" అన్నాడు గుండుభీమన్న.

వాడు బుద్ధిలేని వాడని ముసలివాడు గ్రహించి, వాడితో, "నాయనా, నీ ఆయుస్సు తీరిపోగానే చచ్చిపోతావు," అన్నాడు.

"ఆయుస్సు ఎప్పటికి తీరిపోతుంది?" అని గుండుభీమన్న మళ్ళీ అడిగాడు.

"నీ తల వెంట్రుకలన్నీ తెల్లబడిపోయాక ఆయుస్సు తీరిపోతుంది," అన్నాడు ముసలివాడు.

"తల వెంట్రుకలు తెల్లబడే దెలాగ?" అని మళ్ళీ అడిగాడు గుండుభీమన్న.

ఈ వెర్రివాణ్ణి వదిలించుకుందామను కుని ముసలివాడు, "అదెంత భాగ్యం? పొద్దున్నే లేచి మంచి గేదె పెరుగు వేసుకుని అన్నం తిని, ఆ చెయ్యి కడుక్కోకుండా జుట్టుకు రాసుకో. తరవాత నీకు మూడు త్రేపులు వస్తాయి. మూడో త్రేపుకు ప్రాణం పోతుంది," అన్నాడు ముసలివాడు.

గుండుభీమన్న ఈ సలహాతో పూర్తిగా తృప్తిపడి, ముసలివాడి కాళ్ళు వదిలాడు. వాడు తాను కొట్టిన కొమ్మను నరికి కట్టె పేళ్ళు వేసుకుని, వాటితో ఇంటికి వెళ్ళి బామ్మతో "బామ్మా, రేపు పొద్దున నాకు గట్టి గేదె పెరుగు వేసి అన్నం పెట్టాలి," అన్నాడు. తిండి విషయంలో రుచి ఏమిటో మనవడికి తెలిసివచ్చింది గదా అనుకుని బామ్మ సంతోషించింది. ఆవిడ గుండు భీమన్న కోసం మరింత జాస్తిగా పెరుగు తోడుపెట్టింది.

మర్నాడు లేస్తూనే గుండుభీమన్న తాను చావబోతున్నందుకు సంతోషించాడు. తాను

పోయాక తనను పాతెయ్యటం బామ్మకు లేనిపోని యాతన. అందుకని వాడు ఊరి బయటికి పోయి ఒక చోట లోతైన గుంట తవ్వి పెట్టుకుని ఇంటికి తిరిగివచ్చాడు.

బామ్మ వాడికి గట్టి పెరుగు వేసి అన్నం పెట్టింది. ముసలాయన చెప్పిన ప్రకారం వాడు పెరుగన్నం తినేసి తన ఎంగిలి చేతిని తలకు రుద్దుకున్నాడు. వెంట్రుకలకు పెరుగు అంటుకున్నది. అద్దంలో చూసు కుంటే వాడికి తన వెంట్రుకలు అక్కడక్కడా తెల్లగా ఉండటం కనిపించింది.

"జుట్టు తెల్లగా అయింది. ఇక ఆయుస్సు చెల్లి పోయినట్టే!" అనుకున్నాడు గుండు భీమన్న. అంతలోనే వాడికొక త్రేపు వచ్చింది. "ఒక ప్రాణం పోనే పోయింది. ఇంక రెండు ప్రాణాలు పోవాలి," అనుకుంటూ వాడు ఊరి బయట తాను తవ్వి ఉంచు కున్న గుంట వద్దకు పరిగెత్తాడు. వాడికి దారిలో రెండవ త్రేపూ, గుంట వద్దకు చేరాక మూడవ త్రేపూ వచ్చాయి.

"ఇప్పుడు నేను పూర్తిగా చచ్చి పోయాను," అనుకుంటూ గుండుభీమన్న గుంటలో దూకి గుంటను పూడ్చుకోసాగాడు. మట్టి మెడదాకా వచ్చేసరికి ఇక వాడి చేతులు పని చెయ్యలేదు. ఏం చెయ్యాలో



తోచక వాడు తల మాత్రం కనపడుతూ గుంటలో ఉండిపోగా, ఒక కుక్క అటుగా వెళుతూ, వాడి తలకు రాచిన పెరుగు వాసన పట్టి తోక ఆడించుకుంటూ వాడి దగ్గరకు వచ్చి, వాడి తలకు రాచిన పెరుగంతా శుభ్రంగా నాకేసి, వెళ్ళిపోయింది.

ఇంతలో ఆ దారినే ఒక షావుకారు గుర్రం మీద వచ్చాడు. నేల మీద ఉత్త మనిషి తల చూసి ఆయన మొదట్లో, అది బతికివున్న వాడి తల అనుకోలేదు. కాని సహాయం కోసం ఎదురుచూస్తున్న భీమన్న ఆయనను చూసి, గుంటపూడ్చమని కళ్ళతో అభినయం చేసి చెప్పాడు.

షావుకారు గుర్రం దిగివచ్చి, "ఏం తప్పు చేశావు? నీకీ శిక్ష విధించిన దెవరు?" అని అడిగాడు. ఆయన ఎన్ని ప్రశ్నలు వేసినా గుండుభీమన్న నోటితో సమాధానం చెప్పక కళ్ళతో సంజ్ఞలు చేశాడు. కాని షావుకారు ప్రశ్నలు మానలేదు.

చివరకు గుండుభీమన్న, ప్రాణంవిసిగి, "నేను చచ్చి పోయానయ్యా, బాబూ. నన్ను మరింత చంపక ఆ మట్టి వేసి గొయ్యి పూడ్చెయ్యి," అన్నాడు.

"చచ్చిపోతే ఎలా మాట్లాడు తున్నావు?" అని షావుకారు అడిగాడు, వాడు పిచ్చి వాడని గ్రహించి.

"నేను చచ్చానని నీకు చెబితేనేగాని అర్థం కాకపోయె. ఏం చెయ్యనూ?" అన్నాడు గుండుభీమన్న.

"చూడు, అబ్బాయీ. నేను నీకు కొత్త జన్మ ఇస్తాను. మనిషి చచ్చినా జీవుడు చావడు. తెలుసా?" అన్నాడు షావుకారు.

"బామ్మకూడా ఆ మాటే అన్నది. స్వాములవారు ఆ మాటే చెప్పారు. ఆయన చచ్చి బతికాడు కూడా. నేను చచ్చికూడా జీవంతోనే ఉంటిని. అయితే నేనింక బామ్మ దగ్గిరికి వెళ్ళను. నన్ను అస్తమానమూ వెర్రికుంక అంటుంది," అన్నాడు భీమన్న.

"అలా అయితే నాతోరా," అంటూ షావుకారు వాణ్ణి గోతిలోనుంచి పైకి లాగాడు.

షావుకారుకు పనివాడు కావాలి. ఆయన సూనె కొనుక్కురావటానికి పోతున్నాడు.

"ఈ గుండిగ తీసుకుని గుర్రం వెనకనే నా వెంట రా. సూనె కొని నీ కిస్తాను. దాన్ని మా ఇంటికి పట్టుకు రా. నీకు పావలా కూలి ఇస్తాను. ఆ తరవాత మా ఇంటో పనికి పెట్టుకుని జీతం ఇస్తాను. సమ్మత మేనా?" అని షావుకారు గుండుభీమన్నను అడిగాడు. భీమన్న సమ్మతమేనని చెప్పి షావుకారు వెంట వెళ్ళాడు.

[పై మాసం మరొక సంఘటన]





కష్టార్జితం

గుండు భీమన్నను పనిలోకి తీసుకున్న షావుకారు బస్తీలో గుండిగ నిండా నూనె కొని, మళ్ళీ గుర్ర మెక్కి తన గ్రామానికి బయలుదేరాడు. గుండు భీమన్న నూనె గుండిగను నెత్తిన పెట్టుకుని, గుర్రం వెనకగా నడవసాగాడు.

చూస్తున్న కొద్దీ గుండు భీమన్నకు గుర్రం మీద మోజు పుట్టుకొచ్చి, తనకుకూడా అటు వంటి గుర్రం ఉంటే బాగుండు ననిపించింది. వాడు షావుకారును, "దొరగారూ, ఆ గుర్రం ఖరీ దెంత ?" అని అడిగాడు.

"అయిదువందలు. కొంటావా ఏమిటి ?" అన్నాడు షావుకారు.

గుండు భీమన్న నడుస్తూ ఆలోచించాడు. ఇంటికి పోగానే షావుకారు పావలా ఇస్తాడు. అదిపెట్టి ఒక ఆడకోడి గుడ్డూ, ఒక మగ కోడి గుడ్డూ కొనవచ్చు. ఆ గుడ్లలో నుంచి ఒక పెట్టా, ఒక పుంజూ వస్తాయి. అవి చాలా గుడ్లు పెడతాయి. వాటన్నిటి నుంచీ కోళ్ళు వచ్చి ఇంకా అన్నిరెట్లు గుడ్లు పెడతాయి. అవికూడా పెద్దవయాక అన్నిటినీ అమ్మితే నూరు రూపాయలు వస్తాయి. ఆ నూరు రూపాయలూ పెట్టి గొర్రెలను కొని కొద్దికాలం మేపితే పెద్ద గొర్రెల మంద తయారవుతుంది. ఆ మందను అమ్మితే సులువుగా అయిదువందల రూపాయలూ చేతికి వస్తాయి. ఆ డబ్బుపెట్టి తానుకూడా ఒక మంచి గుర్రాన్ని ఎక్కి, దౌడో దౌడు! దౌడో దౌడు!...

గుంగు భీమన్న నూనె గుండిగను పట్టుకున్న రెండు చేతులూ తీసి కళ్ళెపు తాళ్ళు పట్టుకున్నట్టు నటిస్తూ, ఎగురుతూ పరిగెత్తాడు. మరుక్షణమే నూనె గుండిగ కింద పడి నూనె అంతా నేలపాలయి పోయింది.

షావుకారు ఆ చప్పుడు విని వెనక్కు తిరిగి చూసి, తన గుర్రాన్ని ఆపి దిగివచ్చి,



కోపంతో, "ఏమిట్రా ఇదీ?" అని అడిగాడు.

"తప్పు నాది కాదండి, నా గుర్రంది! అది మీ గుర్రం కన్న ముందు పరిగెత్తాలని చూసింది," అన్నాడు గుండు భీమన్న.

ఆ మాట షావుకారుకు అర్థం కాలేదు. గుండు భీమన్న తాను చేసిన ఆలోచన అంతా ఆయనతో చెప్పి, "నా పావలా సంగతి మరిచేరు," అన్నాడు.

"వెధవా, నాకు ఇంతనష్టం కలిగించింది చాలక, పావలాకూడా అడుగుతున్నావా? ఈ నష్టం తీరేదాకా నీ చేత చాకిరీ చేయించుకున్న మీదట నీ పావలా సంగతి చెబుతాను. ముందు ఇంటికి పద," అంటూ షావుకారు ఖాళీగుండిగ భీమన్న నెత్తిన పెట్టి, ఇంటికి తీసుకు పోయాడు.

షావుకారింటి వద్ద ఒక తెల్లకుక్క ఉన్నది. దానికి ఒంటిమీద పుండు పడింది. రోజూ షావుకారు స్వయంగా పుండుకు మందు రాచేవాడు. ఇప్పుడు నౌకరు ఏర్పడ్డాడు గనక ఆయన గుండు భీమన్నతో, "కుక్క పుండుకు మందురాచి, దానిపైన ఈగలు వాలకుండా చూడు," అన్నాడు.

గుండు భీమన్న కుక్కకు మందురాచి దాని పక్కనే కూచున్నాడు. ఈగలు వచ్చి పుండు మీద వాలబోయాయి.

వాడు చెయ్యి ఊపి, "పొండి, పొండి! దొరగారు వాల వద్దని చెప్పారు, వినలేదా?" అని ఈగలను కోప్పడ్డాడు.

ఈగలు అవతలికి వెళ్ళినట్టేవెళ్ళి మళ్ళీ వచ్చాయి. "చెబుతుంటే మీకాక్కాదూ? బుద్ధి ఉండక్కర్లా?" అని గుండు భీమన్న వాటిని కోప్పడ్డాడు. అయితే ఈగలు విని పించుకోలేదు.

"దెబ్బకుగాని దయ్యం వదలదు," అంటూ గుండు భీమన్న అవతలికి వెళ్ళి ఒక పెద్ద రోకలి తెచ్చి, కుక్కమీద వాలిన ఈగలను చావగొట్ట బోయాడు. అదిచూసి కుక్క హడలిపోయి బయటికి పరిగెత్తింది.



భీమన్న దాన్ని వెంబడించాడు. వాణ్ణిచూసి కుక్క మరింత వేగంగా పరిగెత్తింది.

ఇద్దరూ ఊరి వెంట పడ్డారు. పారిపోతున్న షావుకారుగారి కుక్కను చూసి ఊరకుక్కలకు అలుసై, అవికూడా దాని వెంట పడ్డాయి. గుండు భీమన్న ఆ కుక్కల మంద వెనక పరిగెత్తాడు.

ఈ గొడవలో అసలు కుక్క ఎటో తప్పించుకు పోయింది. గుండు భీమన్న మరొక తెల్ల కుక్కను పట్టుకుని, "తప్పించుకు పోదామనుకున్నావా? ఇంటికి పద!" అన్నాడు. అది వాణ్ణి కరవ బోయింది. వాడు దాని మూతి గట్టిగా నొక్కిపెట్టి, రెండో చేత్తో దాన్ని ఎత్తుకుని షావుకారుగారింటికి వచ్చి, కుక్కను నేలమీద పెట్టాడు. ఊపిరి సలపక అది దారిలోనే చచ్చింది.

షావుకారు ఆ కుక్కను చూసి, "ఇది ఎవరిదిరా? దీన్నెందుకు తెచ్చావు?" అని కోప్పడ్డాడు.

"ఇది మనదేనండీ. తెల్లకుక్క! కనిపించటంలా?" అన్నాడు గుండు భీమన్న.

"వెధవా, ఇది మన కుక్కయితే పుండేదీ?" అని షావుకారు అడిగాడు.

"మందు రాశాంగా? పోయింది పుండు!" అన్నాడు గుండు భీమన్న.

షావుకారుకు వాడి మాటలు వింటుంటే మండుకొచ్చింది. "మనదైతే మాత్రం చచ్చినదాన్ని ఇంటి కెందుకు తెచ్చావు?" అన్నాడాయన.

"నేను పట్టుకున్నప్పుడది బతికే ఉంది. నన్ను కరవ బోయింది, అందుకని మూతి గట్టిగా నొక్కి పట్టుకున్నాను," అన్నాడు గుండు భీమన్న.

"ఓరి నీ బుద్ధి బుగ్గిగానూ! ఎవరిదో ఊళ్లోవాళ్ళ కుక్కను కాస్తా చంపేశావు. వాళ్ళకీ సంగతి తెలిస్తే నా మర్యాదా, నీ ప్రాణాలూ దక్కవు! దీన్ని ఒక చాపలో చుట్టి చంకన పెట్టుకో. నేను గడ్డపార

తీసుకుని ముందుగా ఊరి బయటికి వెళ్ళి గుంట తవ్వుతాను. అందులో ఈ కుక్కను పాతిపెట్టి, గుట్టు చప్పుడు కాకుండా తిరిగి వద్దాం!" అన్నాడు షావుకారు.

ఆయన గడ్డపార తీసుకుని వెళ్లిపోయాక గుండు భీమన్న చచ్చిన తెల్లకుక్కను ఒక చాపలో చుట్టి చంకన పెట్టుకుని వెనకగా బయలుదేరాడు.

వాడు దారి వెతుక్కుంటూ షావుకారున్న చోటికి వెళ్ళేసరికి ఆయన గుంట తవ్వి సిద్ధంగా ఉన్నాడు.

"ఇంతసేపు చేశావేమిటి? కుక్కను వేగిరం బయటికి తియ్యి," అన్నాడాయన గుండు భీమన్నతో. కాని తీరా చాప చుట్ట విప్పి చూస్తే అందులో ఏమీలేదు. కుక్క దారిలో ఎక్కడో పడిపోయింది.

"వచ్చిన దారినే వెళ్ళి ఆ కుక్కను ఎక్కడ పారేశావో చూసి త్వరగా పట్టుకురా," అని షావుకారు గుండు భీమన్నను మళ్ళీ తరిమాడు.

వాడు తాను వచ్చిన దారి జ్ఞాపకంలేక మరొక దారిన యజమాని ఇంటిదాకా వెళ్ళాడు. దారిలో ఎక్కడా చచ్చిన కుక్క కనిపించలేదుగాని, ఇంటికి వచ్చేసరికి అసలు కుక్క ఇల్లు చేరి ఒక మూల పడుకుని ఉండటం కనిపించింది.



"దొంగ పీనుగా, దొరికావా?" అని గుండు భీమన్న ఆ కుక్కను తీసుకుని, షావుకారు వేచి ఉన్న చోటికి తెచ్చి, "దొరక్క ఎక్కడికి పోతుంది? ఇదుగో తెచ్చాను, పూడ్చండి," అన్నాడు.

"ఓరి దౌర్భాగ్యుడా, ఇది మన కుక్కరా. బతికే ఉంది. దీన్నెందుకు పూడ్చటం? ఆ చచ్చిన కుక్కేదీ?" అన్నాడు షావుకారు నిస్పృహతో.

"మీరు కాదన్నారుగాని, ఆ చచ్చిన కుక్క ఇదే నండీ! ఆ సన్యాసిలాగే ఇది కూడా చచ్చి మళ్ళీ బతికింది," అన్నాడు గుండు భీమన్న.

"ఛీ, తప్పుడు వెధవా! వెళ్ళి ఆ చచ్చిన కుక్కను పట్టుకురా!" అని యజమాని గద్దించాడు.

విధిలేక గుండు భీమన్న మళ్ళీ బయలు దేరాడు. ఈసారి వాడు వచ్చిన దారినే వెళ్ళాడు. కుక్క పడిపోయిన చోట గుంపు చేరింది. ఆ గుంపులో దాని యజమాని కూడా ఉన్నాడు. కుక్క ఎలా చచ్చిపోయి ఉంటుందా అని అందరూ ఆశ్చర్యపడు తున్నారు. ఇంతలో గుండుభీమన్న అక్కడికి వచ్చి, చచ్చివున్న కుక్కను చూసి, "నువిక్కడున్నావా? రా, పూడ్చేస్తాం!" అంటూ ఆ కుక్కను ఎత్తుకున్నాడు.



అందరూ వాణ్ణి నిలవేసి, "ఏమిటిది ? ఎవరు నువ్వు? ఆ కుక్కతో నీ కేం పని? నువే దాన్ని చంపావా?" అని అడిగారు.

"మీ రుండంతయ్యా? గుంట దగ్గిర యజమాని కాచుకునున్నాడు. ఎవరికీ తెలీకుండా దీన్ని ముందు పాతెయ్యాలె!" అన్నాడు గుండు భీమన్న

క్షణంలో నిజం తెలిసి పోయింది. అందరూ కలిసి గుండు భీమన్న వెంట షావుకారున్న చోటికి వెళ్ళి, "ఏమండీ, పెద్దవారు! మీకుకూడా ఇదేం పోగాలం?" అని అడిగారు.

పెద్ద మనిషికి అవమాన మయింది. ఆయన నెత్తి బాదుకుంటూ చచ్చిపోయిన కుక్క యజమానితో, "బాబూ, దారేపొయ్యే శనిని ఇంటికి తెచ్చుకున్నాను. వాడి బుద్ధి తక్కువ ఇంతా చేసింది. కుక్క చచ్చినందుకు డబ్బిచ్చుకుంటాను. ఇంతటితో నన్ను వదిలిపెట్టండి," అన్నాడు.

ఆయన భీమన్నతో, "చేసింది చాలురా, బాబూ! ఇకనైనా వెళ్ళిపో!" అన్నాడు.

"అదేమిటి, దొరగారూ? నా పావలా మాటేమిటి?" అన్నాడు గుండు భీమన్న.

"చేసింది చాలక ఇంకా పావలా కావాలిట్రా? నీకు సిగ్గులేదూ?" అన్నాడు షావుకారు కోపంగా.

"మీ నష్టం తీరేదాకా చాకిరీ చేసినాక పావలా మాట చెబుతానంటిరి గదండీ. చాకిరీ చేశానుగద!" అన్నాడు భీమన్న.

వాడితో మాట్లాడుతూ అక్కడే నిలబడితే నలుగురి మధ్యా తన పరువు పూర్తిగా పోతుందని, వాడు వదిలిందేచాలు నను కుంటూ ఆ షావుకారు వాడికి పావలా ఇచ్చేశాడు.

గుండు భీమన్న పరమానందంతో ఎగురుకుంటూ బామ్మకు పావలా చూపించటానికి ఇంటికి బయలుదేరాడు.

[పై మాసం మరొక సంఘటన]





కొత్త నౌకరి

షావుకారిచ్చిన పావలా జేబులో వేసుకుని భీమన్న నడక సాగించాడు. వాడు అడవి దారినపడి పోతూండగా చీకటి పడింది. ఆ చీకటిలోనే వాడు నడుస్తూ కొంత దూరం వెళ్ళాక వాడికి కొందరు మనుషులు, నెత్తిన మూటలు పెట్టుకుని ఎదురు వచ్చారు.

వారు నగల వర్తకులు. అడవికి అవతల ఉండే గ్రామంలోని వాళ్లు. ఆ గ్రామం మీద దొంగలు పడగా, ఈ నగల వర్తకులు తమ వద్ద ఉండే వెండి బంగారాలతో పారిపోయి వస్తున్నారు. నగల వర్తకులు ఆ రాత్రికి అడవిలోనే ఉండి పోదలిచారు.

వాళ్ళు భీమన్నను చూసి, "అబ్బాయీ, నువు ఎక్కడికి పోతున్నావో. అవతల ఊళ్లో దొంగలు పడ్డారు. మేం అక్కడినుంచే పారిపోయి వస్తున్నాం. ఈ రాత్రికి మేమిక్కడే పడుకో దలిచాం," అన్నారు. "మీ రెవరు?" అని భీమన్న అడిగాడు.

"మేము నగల వర్తకులం. మేమీ చెట్ల మీద ఎక్కి పడుకుంటాం. నువు కాస్త కనిపెట్టి ఉన్నావంటే నీకు కొంత ముట్ట జెప్పుతాం," అన్నారు వారు.

"మీరు చెట్లెక్కండి, నేను మాత్రం కిందనే పడుకుంటాను," అన్నాడు భీమన్న.

"పురుగూ పుట్రా వస్తే?" అన్నారు నగల వర్తకులు.

"చంపేస్తాను. మరేం భయం లేదు. మీరు మాత్రం నిద్రలో కింద పడిపోకుండా జాగ్రత్త పడండి," అన్నాడు భీమన్న.

"భలేవాడు! గట్టివాడు! ధైర్యశాలి!" అని భీమన్నను మెచ్చుకుంటూ నగల వర్తకులు చెట్లెక్కి, తమ మూటలను చెట్టు కొమ్మలకు తగిలించి, తాము పడిపోకుండా గట్టిగా కొమ్మలకు కట్టుకుని నిద్రపోయారు.

భీమన్న మటుకు చెట్టు మొదలుకు చేరగిలబడి అలాగే నిద్ర పోయాడు.

ఒక రాత్రివేళ దొంగలు బారుగా నడుస్తూ అటుగా వచ్చారు. ముందు నడిచే దొంగ భీమన్న కాలు తగిలి పడిపోతూ, "కొంచెం ఎడంగా రండి. ఇక్కడ ఏదో దుంగ అడ్డంగా ఉంది," అన్నాడు.

దొంగ కాలు తగలగానే భీమన్న మేలు కున్నాడు. వాడు కోపంగా, "ఏమయ్యో, నన్ను దుంగ అంటావా? నీకు కళ్ళు లేవూ?" అంటూ లేచి నిలబడ్డాడు.

"ఓహో, మనిషివా? అయితే నీ దగ్గిర ఉన్నదంతా ఇచ్చెయ్యి. లేకపోతే చంపే స్తాము," అన్నాడు దొంగ.

"ఇస్తాను. కాని మీరెవరు?" అన్నాడు భీమన్న.

"దొంగలం! ఊఁ, నీ దగ్గిర ఉండేదంతా పైకి తియ్యి," అన్నారు దొంగలు.


"మీరేనా దొంగలంటే. సరే, ఈ పావలా తీసుకోండి. నా దగ్గిర ఇంతకన్న ఇంకేమీ లేదు," అంటూ భీమన్న తన దగ్గిర ఉన్న పావలా వాళ్ళకిచ్చేశాడు. వాళ్ళు తమ దారిన బయలుదేరారు.

వాళ్ళు కొంతదూరం వెళ్ళాక భీమన్న, "ఏమండోయ్, దొంగలూ!" అని వెనక్కు పిల్చి, "ఆ పావలా నా కొక షావుకా రిచ్చాడు. అది ఒకవేళ పూటా పావలా అయితే తరవాత నన్ని ఏమీ లాభంలేదు. ఈ చెట్ల మీద నగల వర్తకులున్నారు. వాళ్ళకు చూపిస్తే ఆ పావలా మంచిదయిందీ, పూటా అయిందీ చెబుతారు!" అన్నాడు.

"నగల వర్తకులు" అన్న మాట చెవిని పడగానే దొంగలకు ఎక్కడలేని ఉత్సాహమూ వచ్చింది. వాళ్ళు చెట్లన్నీ ఘాలించి, నగల వర్తకుల నందర్నీ చితక తన్ని వారి మూటలు కాజేశారు. వాళ్ళు భీమన్నతో, "నువ్వు మాతో చేరిపో. నీకు దొంగతనం నేర్పిస్తాం. సుఖంగా బతకవచ్చు!" అన్నారు.

"ఓ, అలాగే చేరుతాను. నా కెక్కడైనా ఒకటే," అన్నాడు భీమన్న దొంగలతో.





దొంగల కొలువు

భీమన్న దొంగల వద్ద పనికి కుదిరిన కొద్ది కాలంలోనే, వాడికి అంతులేని శరీరబలం తప్ప బుద్ధిబలం కొంచెంకూడా లేదని దొంగలకు తెలిసిపోయింది. అందుచేత వాళ్ళు భీమన్నకు యుక్తిగల పనులేవీ చెప్పక, అతడిచేత బండపనులు మాత్రమే చేయిస్తూ వచ్చారు. భీమన్న ఎంతెంత బండ పనులనూ సునాయాసంగా చేస్తూవచ్చాడు.

ఒకనాటి రాత్రి దొంగలు ఒక ధనికుడి ఇంట దొంగతనం చెయ్యటానికి భీమన్నను వెంట తీసుకుని బయలుదేరారు. వాళ్ళు యుక్తిగా ఇంటికి కన్నం తవ్వి, లోపలికి భీమన్నను పంపుతూ, "లోపల కాస్త బరువుగా కనిపించే వస్తువులు మాత్రమే చూసి, వాటిని తెచ్చి, ఈ కన్నంలో నుంచి మాకు అందించు," అన్నారు. వాళ్ళ ఉద్దేశం వెలగల వస్తువులన్నీ బరువైన పెట్టెలలో వుంటాయని.

భీమన్న దొంగలు చెప్పినదానికి సరేనని, ఇల్లంతా తిరిగి కనిపించిన వస్తువల్లా ఎత్తి చూశాడు. పెద్ద పెద్ద పెట్టెలుకూడా వాడికి తేలికగానే కనిపించాయి. చివరకు వాడికి వంట ఇంట్లో రుబ్బురోలు కనిపించింది. దాన్ని కదిలిస్తే కదిలిందిగాని, ఎత్తబోతే లేవలేదు.

"ఇదే దొంగలకు కావలిసిన వస్తువు. ఎవరైనా సాయంపట్టి భుజానికెత్తితే పట్టుకుపోవచ్చు," అనుకుంటూ భీమన్న అటూ ఇటూ చూసేసరికి, వంట ఇంట్లోనే మూలగా పడుకుని నిద్రపోతున్న వంటవాడు కనిపించాడు.

భీమన్న వాడి దగ్గిరికి వెళ్ళి తట్టి లేపుతూ, "ఏమండోయ్, కాస్త లేచి ఈ రుబ్బురోలు సాయం పట్టండి," అని అడిగాడు.

వంటవాడు గాబరాపడుతూ లేచి కూచుని, "ఎవరు నువు? రుబ్బురోలు

సాయం పట్టటమేమిటి?" అని భీమన్నను అడిగాడు.

"ఇది దొంగలకు కావాలట. వాళ్ళు కన్నం దగ్గిర వేచి ఉన్నారు. ఈ రోలు నే నొక్కణ్ణీ ఎత్తలేకుండా వున్నాను!" అన్నాడు భీమన్న. వంటవాడు, "దొంగలు! దొంగలు!" అని కేకలు పెట్టాడు. అందరూ లేచి భీమన్నను పట్టుకున్నారు. ఈ అల్లరి ఆలకించి దొంగలు అప్పుడే పారిపోయారు. ఇంటి వాళ్ళు గుండు భీమన్నను రకరకాలగా ప్రశ్నించి, వాడు వట్టి మడ్డి వెధవ అని తెలుసుకుని, వదిలిపెట్టేశారు. వాడు దొంగలను వెతుక్కుంటూ వెళ్ళాడు.

దొంగలు వాణ్ణి నానా తిట్లూ తిట్టారు. వాణ్ణి కొలువులో నుంచి తీసేద్దా మను కున్నారు, కాని వాడు ఇకమీద బుద్ధిగా ఉంటా ననటం వల్ల క్షమించి తమ వెంట వుంచుకున్నారు.

మరొకనాడు దొంగలు ఒక జమీందారు ఇంట దొంగతనానికి బయలుదేరారు. వారి వెంట భీమన్నకూడా వున్నాడు. వాళ్ళు ఈసారి కన్నం వేసి, భీమన్నను ఇంట్లోకి పంపుతూ, "కిందటిసారి లాగా రుబ్బురోళ్ళ జోలికి పోకు. ఈ ఇసక తీసుకో. మిద్దెమీదికి వెళ్ళి అంతటా ఇసక చల్లు. ఏ వస్తువుమీద ఇసక పడ్డప్పుడు గలగలా శబ్దం అయితే



ఆ వస్తువునల్లా పట్టుకురా!" అని చెప్పారు. భీమన్న దొంగల వద్ద నుంచి ఇసక మూట తీసుకుని మిద్దె మీదికి వెళ్ళాడు. అక్కడ చాలామంది పడుకుని నిద్రపోతున్నారు. కొందరు నోర్లు తెరుచుకుని మరీ నిద్రపోతున్నారు.

"దొంగలు ఇసక చల్లమన్నారుగదా! ఇసక చల్లితే అది వాళ్ళ మొహాలమీదా, నోళ్ళలోనూ పడదా?" అనుకుని భీమన్న గట్టిగా, "ఓ హెూయ్, నేను ఇసక చల్లబోతున్నాను. నిద్రలుపోయే వాళ్ళంతా ముసుగులు పెట్టేసుకోండి!" అని కేకలుపెట్టాడు. ఈ కేకలకు అందరూ లేచారు. అల్లరి అయింది. దొంగలు పారిపోయారు. ఇంటి వాళ్ళు భీమన్నను కూడా కొంత సేపయాక వెళ్ళిపోనిచ్చారు. వాడు మళ్ళీ దొంగల వద్దకు తిరిగి వెళ్ళాడు.

ఈసారి భీమన్న దొంగలచేత తిట్లూ, తన్నులూకూడా తిన్నాడు. వాడు క్షమించమని ప్రాధేయపడ్డాడు. "ఇంకోసారి ఇలా చేశావంటే ఏకంగా నీ తల తీసేస్తాం. ఒళ్లు జాగ్రత్త పెట్టుకుని ఉండు!" అని దొంగలు వాణ్ణి గట్టిగా హెచ్చరించారు.

తరవాత ఒకరోజున దొంగలు రాజుగారి దివాణాన్ని కొల్లగొట్టటానికి బయలుదేరారు. ఆ దివాణంలో ధాన్యపు కొట్లూ, పశువుల



సాలలూ, రకరకాల గిడ్డంగులూ ఉన్నాయి. ఒక్కొక్క ఇంటినే దోచుకోవటానికి ఒక్కొక్క దొంగ ఏర్పాటయాడు. భీమన్నను మాత్రం దివాణం వెలపల నిలబడి, ప్రమాద పరిస్థితి ఏర్పడితే కొమ్ముబూరా ఊదేటట్టు ఏర్పాటు చేసుకున్నారు. ఆ బూరా మోత వినగానే ఎక్కడి దొంగ అక్కడి నుంచి జారుకుంటా డన్నమాట.


దొంగలందరూ తలా ఒక దారినా దివాణం లోకి వెళ్ళిపోయాక భీమన్న కొంచెంసేపు ఒంటరిగా నిలబడి, "ఎక్కడా ప్రమాదం జాడ లేదులే!" అనుకుని తానుకూడా లోపలికి జొరబడ్డాడు. లోపలికి పోగానే వాడికి ఎదురుగా పశువులశాల కనిపించింది. అందులో ఒక దొంగ ఒక ఆవును విప్ప టానికి ప్రయత్నిస్తున్నాడు. అది పొగరు బోతు ఆవు. దగ్గిరికి వస్తే తల విసురు తున్నది. ఒకే మనిషి దాని కొమ్ములు పట్టు కుని పలుపు విప్పటానికి లేదు.

అందుచేత ఆ దొంగ, తన దగ్గిరికి వచ్చిన వాడు భీమన్న అనికూడా గమనించకుండా, "ఒరే, బాబూ! కాస్త కొమ్ముపట్టు!" అన్నాడు. వెంటనే భీమన్న చంకలో నుంచి కొమ్ము బూరా తీసి "తుర్రోం" అని పెద్దగా ఊదాడు.

ఈ చప్పుడుకు రాజ భటులు మేలు కున్నారు. బూరా చప్పుడు బయటి నుంచి కాక లోపలి నుంచి ఎందుకు వచ్చిందా అని ఆశ్చర్యపోతూ దొంగలు ఎక్కడివా ళ్ళక్కడే నిలబడిపోయి, రాజ భటులకు దొరికిపోయారు.

రాజుగారు దొంగలందరినీ విచారించి కారాగృహంలో యావజ్జీవ శిక్ష విధించాడు. దొంగలను పట్టిచ్చినందుకు భీమన్నకు అయిదువందల రూపాయలు నగదు బహు మతీ, వాడి వేలికి ఖరీదైన ఉంగరమూ దొరికాయి. వాటితోసహా వాడు తన ఇంటికి బయలుదేరాడు.





ఉపకారికి ఉపకారం

దొంగలను పట్టిచ్చినందుకు గాను బహుమానంగా వచ్చిన సొమ్ము ఒక మూటగా కట్టి బొడ్డులో పెట్టుకుని భీమన్న బామ్మను చూడటానికి ఇంటి దారి పట్టాడు. ఈ డబ్బు చూసి బామ్మ చాలా సంతోషిస్తుంది. ఇక ఎన్నడూ తనని పనికిమాలిన వెధవ అని తిట్టదు! ఇలా అనుకుని వాడు ఎగురుతూ, గెంతుతూ మహా ఉత్సాహంగా నడక సాగించాడు.

భీమన్న కొంతదూరం వెళ్ళేసరికి దారిలో ఒక కాలవ తగిలింది. ఆ కాలవ చాలా లోతున పారుతున్నది. దాని గట్లు చాలా ఎత్తుగా ఉన్నాయి. కాలవకు అడ్డంగా తేలికైన చెక్కల వంతెన వేసి ఉన్నది. భీమన్న ఉత్సాహంగా గెంతుతూ ఈ చెక్కల వంతెన మీదుగా పొయ్యేటప్పుడు వంతెన కాస్తా విరిగింది. సగం వంతెన కాలవలో పడిపోయింది, సగం నిలిచి ఉన్నది. భీమన్న కింద పడిపోతూ అదృష్టవశాత్తూ నిలిచి ఉన్న భాగం పట్టుకుని వేళ్ళాడసాగాడు.

వాడు పైకి ఎక్కలేక వంతెన చెక్క పట్టుకుని అలా వేళ్ళాడే సమయంలో అటుగా ఒక సాతాని వచ్చాడు. అతను భీమన్న దుస్థితి చూసి, "అయ్యో, పాపం! అర్భకుడు పెద్ద చిక్కులో పడిపోయాడు!" అనుకుని సహాయం వచ్చాడు.

అతను భీమన్నతో, "అబ్బాయి, గట్టిగా పట్టుకుని ఉండు, నేను నిన్ను ఉపాయంగా కాళ్ళు పట్టుకుని ఒడ్డుకు దించుతాను," అన్నాడు. సాతాని ఉన్న ఒడ్డున కాలవ మీదికి చొచ్చుకు వచ్చిన రాతిబండ ఒకటి ఉన్నది. సాతాని దాని మీద నిలబడి చేతులు ముందుకు చాస్తే భీమన్న పాదాలు అందుతాయి. తాను ఇచ్చే ఊపుకు భీమన్న వడ్డున పడవచ్చు.



సాతాని ఆ రాతి బండ మీదికి వెళ్ళి, నిలబడి, తన చేతులు ముందుకు చాచి, "అబ్బాయి, నీ పాదాలు నాకు అందించు," అన్నాడు, భీమన్నతో.

భీమన్న తన పాదాలను సాతానికి అందించాడు. సాతాని వాటిని గట్టిగా పట్టుకున్నాడు. సాతాని చెయ్యి తగలగానే భీమన్నకు కితకితలు వచ్చాయి. వాడు తన కాళ్ళను పైకి గుంజుకున్నాడు. భీమన్న కాళ్ళను గట్టిగా పట్టుకున్న సాతాని కాళ్లకు రాతిబండ అందకుండా పోయింది. వంతెన పట్టుకుని భీమన్నా, భీమన్న కాళ్ళు పట్టుకుని సాతానీ వేళ్ళాడుతున్నారు.

"అబ్బాయీ, నిన్ను కాపాడబోయి నేను కూడా చిక్కులో పడ్డాను. నువు మాత్రం పట్టు విడవకు, ఇద్దరమూ అఖాతంలో పడి పోగలం! ఎవరన్నా వచ్చేదాకా మనం ఇలా వేళ్ళాడవలిసిందే!" అన్నాడు సాతాని.

భీమన్న తల వంచి, తన కాళ్ళు పట్టుకున్న సాతానిని చూసి, "అయ్యా, నీ భుజం మీద ఆ తాడేమిటి?" అని అడిగాడు.

"అవిచిప్పతాళాలు," అన్నాడు సాతాని.

"అవి దేనికి?" అని భీమన్న అడిగాడు.

"తాళాలు వాయిస్తూ పాట పాడుతూ ఇంటింటికీ తిరిగి అడుక్కుంటాను," అన్నాడు సాతాని.

"అలాగా, ఏదీ ఒక పాట పాడూ!" అన్నాడు భీమన్న.

"ఇప్పుడు పాట పాడటమేమిటి? నా మొహం!" అన్నాడు సాతాని.

"పాట పాడతావా? చేతులు వదిలి పెట్టమన్నావా?" అన్నాడు భీమన్న.

"ఆ పని మాత్రం చెయ్యకు, నీకు పుణ్యం ఉంటుంది," అంటూ సాతాని పాడనారంభించాడు.

"తాళాలు వాయించకుండా వట్టినే పాట పాడుతున్నావేమిటి? తాళాలు వాయించు," అన్నాడు భీమన్న.

"నా చేతులతో నీ కాళ్ళు పట్టుకుంటిని గదా, తాళాలు వాయించటం ఎలా సాధ్యం?" అన్నాడు సాతాని.

"నీకు చెయ్యి విడిగా లేకపోతే నీ తాళాలిలా ఇయ్యి, నేను వాయిస్తాను," అంటూ భీమన్న వంతెన వదిలి చేతులు సాతాని కేసి చాచాడు.

ఇద్దరూ అంత ఎత్తు నుంచి కాలవలోకి పడిపోయారు. అదృష్టవశాత్తూ కాలవలో నీరు హెచ్చుగాలేదు. అందుచేత వారు మునిగి పోలేదు. కాని అంత ఎత్తునుంచి పడటం మూలాన సాతానికి బాగా దెబ్బలు తగిలాయి. సాతానిపైన పడటంచేత భీమన్నకు ఏ దెబ్బా తగలలేదు.



భీమన్న సహాయంతో సాతాని కాలవ గట్టెక్కి, "చేతులూ, కాళ్ళూ విరిగినట్టుగా ఉన్నాయి. కదల్లేను. గాయాలకు కాస్త నూనె రాస్తాను. ఇదుగో ఈ రెండణాల డబ్బులూ, ఈ గిన్నె తీసుకుని, ఊళ్ళోకి వెళ్ళి కొబ్బరినూనె పట్టుకురా!" అన్నాడు.

భీమన్న డబ్బులూ, గిన్నె తీసుకుని ఊళ్ళో దుకాణానికి వెళ్ళి నూనె కొన్నాడు.

దుకాణం మనిషి గిన్నె నిండా నూనె పోసి, "ఇంకొంచెం మిగిలిపోయింది. ఇంకో సీసాగాని, గిన్నెగాని ఉంటే ఇయ్యి, పోస్తాను," అన్నాడు.

భీమన్న నూనె గిన్నె తీసుకుని దాన్ని పరీక్షించి, గిన్నె మట్టు కింద కొంత ఖాళీ ఉండటం కనిపెట్టి, "ఆ మిగిలింది ఇందులో వెయ్యి. ఈ భాగ్యానికి ఇంకో గిన్నెకూడా దేనికి?" అంటూ గిన్నెను బోర్లించాడు. గిన్నెలోవున్న నూనె అంతా ఒలికిపోయింది.

దుకాణంవాడు భీమన్న వట్టి మడ్డివెధవ అని తెలుసుకుని, మిగిలిన నూనె గిన్నె అడుగుభాగంలో పోసి, ఇక పదమన్నాడు. భీమన్న ఆ గిన్నెను అలాగే భద్రంగా సాతాని ఉన్నచోటికి తీసుకుపోయాడు.

"బేడా డబ్బులకు నూనె ఇంతేనా వచ్చింది! గిన్నె బోర్లించి తెచ్చావేమిటి?" అని సాతాని అడిగాడు.

"ఇది మిగిలిన నూనె. అసలు నూనె ఇదుగో!" అంటూ భీమన్న నూనె గిన్నెను వెల్లికిలా తిప్పాడు. అంతటితో అడుగున ఉన్న నూనె కూడా నేల పాలయింది.

"చాలా ఉపకారం చేశావులే, నాయనా! ఇంక నీ దారిన నీవు వెళ్ళు!" అంటూ సాతాని గిన్నెకు అంటిన నూనె తన గాయాలకు రాచుకున్నాడు.

సాతాని తనను మెచ్చుకున్నందుకు సంతోషిస్తూ భీమన్న తన దారి పట్టాడు.

[పై మాసం మరొక సంఘటన]





గుర్రమెక్కి పెళ్ళికొడుకు

గుండు భీమన్న అడవి దారిన పడి బామ్మ ఉండే ఊరికి పోతూండగా దారిలో ఒకచోట ఒక చెట్టుకు ఒక అందమైన గుర్రం కట్టి ఉన్నది. భీమన్న గుర్రం ఎదుట ఆగి, ఎంతో సంతోషంతో దాని కేసి చూస్తూ నిలబడిపోయాడు.

షావుకారును గుర్రం మీద చూసినప్పటి నుంచీ తాను కూడా గుర్రం ఎక్కాలని వాడికి మోజుగా ఉన్నది. గుర్రం ఖరీదు అయిదువందలని షావుకారు చెప్పాడు. ఇప్పుడు తన వద్ద అయిదు వందలున్నాయి—దొంగలను పట్టిచ్చినందుకు తనకా అయిదు వందలు బహుమానం ఇచ్చారు. ఈ గుర్రం చూడబోతే షావుకారు గుర్రం కన్న చాలా అందంగా ఉన్నది. తనకు ఈ గుర్రాన్ని ఎవరన్నా అమ్మితే ఎంత బాగుండు ననుకున్నాడు భీమన్న. అదే సమయంలో చెట్ల వెనకనుంచి ఎవరో వచ్చి, "ఎవరు నువ్వు? ఆ గుర్రం కేసి ఎందుకు అదే పనిగా చూస్తున్నావు?" అని అడిగాడు.

"దీన్ని అమ్ముతావా? కొంటాను," అన్నాడు భీమన్న.

రెండో మనిషి కొంచెం ఆలోచించి, "ఏమిస్తావు?" అని అడిగాడు.

"నాకు గుర్రం ధర తెలియదను కున్నావా? అయిదు వందలు. ఇదుగో ఈ సంచిలో అయిదు వందలున్నాయి. కావలిస్తే ఎంచుకో!" అన్నాడు భీమన్న.

రెండో మనిషి ఆత్రంగా ఆ సంచీ తీసుకుని, "సరే, ఈ గుర్రాన్ని నువ్వు తీసుకుపో," అన్నాడు.

అసలు సంగతేమంటే ఆ గుర్రం వాడిది కాదు, ఒక జమీందారుది. ఆ జమీందారుకు మహాలక్ష్మి అని ఒక కూతురున్నది. ఆమె గుర్రపు స్వారిలో అందెవేసినది. మహాలక్ష్మి కోసం తండ్రి సంబంధాలు వెతికేటప్పుడు

గుండు భీమన్న కథలు—10



ఆమె ఈ గుర్రం మీద స్వారీ చెయ్యగలవాణ్ణే చేసుకుంటానని పట్టుపట్టింది. ఈ గుర్రం మీద స్వారీ చెయ్యటం తేలికైన పని కాదు. అందుచేత చాలామంది దీన్ని ఎక్కి స్వారీ చెయ్యటానికి ప్రయత్నించి, అపజయంతో బాటు పరాభవంకూడా పొందారు.

ఆలా పరాభవం పొందిన వారిలో ఒకడు అవకాశం చూసుకుని ఈ గుర్రాన్ని దొంగిలించి అడవిలో కట్టేసి, దానికి ఒక మనిషిని కాపలి పెట్టాడు. ఆ మనిషి ఇప్పుడు ఆ గుర్రాన్ని గుండు భీమన్నకు అమ్మాడు. భీమన్న యాభైరూపాయ లిచ్చినా వాడా గుర్రాన్ని ఇచ్చేవాడే. ఆ సంగతి భీమన్నకు తెలియదు. గుర్రం ఖరీదు అయిదు వందలని వాడి బుర్రలో పడిపోయింది. అది మరి మారదు.

గుర్రం అమ్మినవాడు భీమన్నను, "నీ కింతకూ గుర్రం ఎక్కటం వచ్చునా? ఎప్పుడన్నా ఎక్కావా?" అని అడిగాడు.

"నే నెన్నడూ గుర్రం ఎక్కి స్వారీ చెయ్యలేదనుకో. అయితేనేం? అదేం బ్రహ్మ విద్యా?" అన్నాడు భీమన్న.

"అయితే ముందు గుర్రం మీద ఎక్కి కూచో, తరవాత కట్లు విప్పుతాను," అన్నాడు రెండోవాడు.

భీమన్న గుర్రం మీద ఎక్కి కూచున్నాక వాడు గుర్రం మెడకు తగిలించిన తాడు విప్పాడు. మరుక్షణమే గుర్రం శరవేగంతో దౌడు సాగించింది.

భీమన్న బలం గలవాడు గనక కాళ్ళు గట్టిగా పట్టుకుని, తన కాళ్ళు గుర్రం పొట్టకు గట్టిగా అదిమి పట్టి, పడకుండా చూసుకో గలిగాడు. మరొకడైతే గుర్రం వేగానికి ఎప్పుడో కిందపడి పోవలిసిందే.

భీమన్న కింద పడిపోలేదన్నమాటేగాని, గుర్రాన్ని ఆపటంగాని, కనీసం దాని వేగం తగ్గించటంగాని, దాన్ని తనకు కావలిసిన దారిన నడిపించటంగాని వాడికి సాధ్యం

కాలేదు. అది ఎటుపోతున్నదీ వాడికి తెలియదు. తెలిసినా ప్రయోజనం లేదు. అది ఎప్పుడు ఎక్కడ ఆగుతుందో దాని ఇష్టమేగాని వాడి ఇష్టం కొంచెంకూడా లేదు.

గుర్రం తిన్నగా జమీందారు ఇంటికి వెళ్ళి అక్కడ ఆగింది. జమీందారు నౌకర్లు, "దొంగ లెత్తుకు పోయిన మన గుర్రం తిరిగి వచ్చింది," అని కేకలు పెడుతూ భీమన్నను చుట్టు ముట్టారు.

"దొంగిలించట మేమిటి? దీన్ని నేను అయిదు వందలు పోసి కొన్నాను; నష్టం లేదు. బాగా పరిగెడుతుంది!" అన్నాడు భీమన్న. నౌకర్లు భీమన్నను జమీందారు వద్దకు తీసుకుపోయారు. భీమన్న జమీందారుతో మిగిలిన విషయాలేమీ చెప్పక, తాను దొంగలను పట్టి ఇచ్చి అయిదు వందలు బహుమానం పొంది, దాంతో అదే ఏలో ఈ గుర్రాన్ని కొని, దానిమీద సవారీ అయివచ్చిన సమాచారం అంతా చెప్పాడు.

ఎవరూ స్వారి చెయ్యలేని గుర్రాన్ని భీమన్న స్వారి చేశాడని విని మహాలక్ష్మి భీమన్నను పెళ్ళాడటానికి ఒప్పుకున్నది. జమీందారుకు కూడా భీమన్న నచ్చాడు. వాడు గుర్రాన్ని స్వారి చెయ్యటమేగాక, దొంగల ముఠాను పట్టి ఇచ్చాడంటే



సమర్థుడై ఉండాలి. అయినా వాడి హోదా ఏమిటో తెలుసుకుంటే బాగుంటుందనుకుని ఆయన భీమన్నతో, "నాయనా, మా అమ్మాయి నిచ్చి చేస్తే పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు.

"ఓ, చేసుకుంటాను. మా బామ్మకూడా సంతోషిస్తుంది. నాకు పెళ్ళి కాదని మా బామ్మకు ఒకటే బెంగ," అన్నాడు భీమన్న.

"మా అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తే కట్నం ఏమిస్తావు?" అని జమీందారు అడిగారు.

"కట్నానికేం భాగ్యం. బామ్మ ఒక పెద్ద బాన నిండా బంగారం దాచి ఉంచింది.

అది నా పెళ్ళి ఖర్చుకేనట. అదంతా తట్టుం కింద తీసుకోండి," అన్నాడు భీమన్న.

"ఓహో, అది చాలా గొప్ప సంబంధమే. బానెడు బంగారం మనం ఏ తరంలోనూ కళ్ళ జూసి ఎరగం!" అనుకుని జమీందారు, పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు. బామ్మనూ, బంగారాన్నీ తీసుకురావటానికి మనుషులను పంపించాడు.

"పిచ్చి వెధవ" అని తన చేత ఎన్నోవేల సార్లు అనిపించుకున్న భీమన్న సరాసరి జమీందారు కూతురినే పెళ్ళాడుతున్నాడని విని బామ్మ పరమానందభరితురాలయింది. ఆమె జమీందారు ఇంటికి వచ్చి, పెళ్ళి కూతురి మెడలో మూడు ముళ్ళూ పడిన దాకా భీమన్న వెర్రిబాగులవాడన్నది బయటపడకుండా తన తెలివితేటలతో కప్పిపుచ్చింది.

పెళ్ళి అయినాక మటుకు ఆమె మహాలక్ష్మితో, "అమ్మా, నీ మొగుడు పట్టి తెలివి తక్కువ దద్దమ్మ. వాణ్ణి నేనే పసితనం నుంచి పెంచి పెద్ద చేశాను. ఇక నుంచి వాణ్ణి చూసుకునే భారం నీది. వాడి మనస్సు చాలామంచిది. తెలివితేటలు లేవన్నమాటే గాని కల్మషం ఎటువంటిదో వాడెరగడు!" అని చెప్పవలసిన మాటలు నాలుగూ చాటుగా చెప్పింది.

మహాలక్ష్మి తెలివిగలది. బామ్మ చెప్పినదంతా గ్రహించి ఆమె, "మీ మనవణ్ణి నేను కంటిని రెప్పలాగా చూసుకుంటాను లెండి. మా నాన్నగారికి నేనొక్కర్తెనే. అందుచేత మీ మనవణ్ణి ఇక్కడే ఉంచుకుంటారు. మీరు కూడా మాతో పాటే యిక్కడ ఉండిపోండి," అన్నది.

కాని బామ్మ ఉండలేదు. ఆమె తన ఇల్లూ వాకిలి చూసుకోవాలని చెప్పి, భీమన్నను జమీందారుగారి కుటుంబానికి అప్పగించి తన ఇంటికి వెళ్ళిపోయింది.

—[పై మాసం ఆఖరు సంఘటన]





పిశాచం వదిలింది

గుండు భీమన్న ఒక ఇంటివాడై, తన భార్య అయిన మహలక్ష్మితో సుఖంగానే కాపరం చేస్తున్నాడు. ఒక రాత్రి మహలక్ష్మి నిద్రపోతూ కొద్దిగా గురకపెట్టిందీ. తన భార్యను ఏదో పిశాచం పట్టుకుని అలా గుర్రుమంటున్నదని వాడికి సందేహం కలిగి, తెల్లవారుతూనే భూతవైద్యుడి కోసం బయలుదేరాడు. తన భర్తను అనుక్షణమూ వెయ్యి కళ్ళతో కనిపెట్టి ఉండే మహలక్ష్మి, "ఎక్కడికో చెప్పకుండా పోతున్నారే?" అన్నది.

"భూతవైద్యుడితో అవసరంగా మాట్లాడాలి," అన్నాడు భీమన్న.

"భూతవైద్యుడితో మాట్లాడాలంటే మీరే వెళ్ళాలా? నౌకరును పంపించి పిలిపిద్దాం," అన్నది మహలక్ష్మి.

"నిజమే కాని, నేను భూతవైద్యుడితో మాట్లాడే మాటలు నువు వినగూడదే?" అన్నాడు భీమన్న.

"వినగూడకపోతే విననులే," అంటూ మహలక్ష్మి నౌకరును పంపించి భూతవైద్యుణ్ణి పిలిపించింది.

భీమన్న భూతవైద్యుణ్ణి ఒక గదిలోకి తీసుకుపోయి, "నా భార్య శరీరంలో ఏదో పిశాచం చేరింది. నిద్రలో అది భయంకరంగా గుర్రుగుర్రు మని నన్ను భయపెడుతున్నది. దాన్ని వదలగొట్టటానికి ఏమైనా చెయ్యాలి," అన్నాడు. భూతవైద్యుడికి నిజం తెలిసిపోయింది. తన భార్య నిద్రలో గురకపెడితే అది పిశాచం అనుకుంటున్నాడు భీమన్న.

భూతవైద్యుడు తన పంట పండిందనుకుని, "అలాగా, పిశాచాన్ని వదిలించటానికి చాలా పెద్ద తంతు ఉన్నది. ఎంతలేదన్నా రెండువేలు ఖర్చవుతుంది," అన్నాడు.

"ఎంత ఖర్చయినా సరే ఇస్తాను," అన్నాడు భీమన్న. ఈ ఇద్దరి సంభాషణా

చాటు నుంచి మహాలక్ష్మి విన్నది. భూత వైద్యుడిమీద ఆమెకు చాలా కోపం వచ్చింది. ఆయన వెళ్ళిపోయేటప్పుడు ఆమె వచ్చి, "ఈ పూట మీరు మా ఇంటనే భోజనం చెయ్యాలి," అన్నది. భూతవైద్యుడు సరే నన్నాడు. మహాలక్ష్మి భోజనం దగ్గిర భూత వైద్యుణ్ణి బాగా ఎక్కతొక్కనట్టు తినిపించింది. భుక్తాయాసంగా ఉండటాన భూత వైద్యుడు అరుగు మీద నడుము వాల్చి కునుకుతీశాడు. పూటుగా తిని ఉన్నాడేమో, నిద్రలో గురక పెట్టసాగాడు.

మహాలక్ష్మి తన భర్తకు భూతవైద్యుణ్ణి చూపించి, "చూశారా, ఈ భూతవైద్యుడెంత ద్రోహం చేశాడో. నా ఒంటో ,ఉన్న లక్ష్మిని కాజెయ్యాలని వీడు ఒక పిశాచాన్ని నా పైకి పంపకం చేశాడు. రాత్రి అది నా ముక్కులో నుంచి ప్రవేశించే సరికి లక్ష్మి దాన్ని తన్ని తరిమేసింది. భూతవైద్యుడి చేతబడి బెడిసి కొట్టటం చేత వాడు పంపకం చేసిన పిశాచం ఇప్పుడు వాణ్ణే ఆవహించింది. అది ఎలా గుర్రు పెడుతున్నదో చూడండి! వీణ్ణి దూరంగా ఉంచకపోతే మన లక్ష్మిని కాజేస్తాడు," అని చెప్పింది.

"అదా కథ?" అంటూ భీమన్న, నిద్రపోయే భూతవైద్యుణ్ణి ఒక్క గుంజుగుంజి లేపి, "ఓరే, పిశాచంగాడా! తక్షణం నా యింటో నుంచి బయటికి నడు! మళ్ళీ నాకు నీ ముఖం చూపించావంటే చంపేస్తాను!" అని అరిచాడు.

అసలే నిద్ర కలతన లేచిన భూతవైద్యుడు కంగారుపడి, దయ్యం పట్టిన వాడల్లే బయిటికి పరిగెత్తాడు.

ఇది జరిగినాక భీమన్న తనకు ఏ వెర్రి మొర్రి ఆలోచన తట్టినా ముందు భార్యకు చెప్పకుండా తాను ఏ నిర్ణయమూ చేసే వాడు కాడు. ఈ విధంగా వాళ్ళు ఏ చిక్కులూ లేకుండా కలకాలం సుఖంగా కాపరం చేశారు. [సమాప్తం]





నౌకరు నియమాలు

గుండు భీమన్న జమీందారుగారి పిల్లను పెళ్ళాడి గొప్పవాడయాడు. అల్లుడుగారికి ప్రత్యేకంగా ఒక నౌకరు కుర్రాడుండి, అతను చెప్పే పనులన్నీ చేస్తూండటం భావ్యంగా ఉంటుందని జమీందారుగారు అనుకున్నాడు. జమీందారుగారి గుమాస్తా అల్లుడుగారి కోసం పది, పన్నెండేళ్ళ కుర్రాణ్ణి ఒకణ్ణి పట్టుకొచ్చాడు. వాడికి ఏడాది కింత జీతం ఇచ్చేట్టూ, ఒక జత బట్ట లిచ్చేట్టూ మాట్లాడుకున్నారు.

ఆ సాయంకాలం భీమన్న తోటలో ఒంటరిగా ఉన్న సమయంలో నౌకరు కుర్రాడి తండ్రి వచ్చి, "బాబుగారూ, మా అబ్బాయిని తమరికి నౌకరుగా ఏర్పాటు చేశారు. వాడికి తిండీ, బట్టా బాగానే జరిగి పోతుందని నాకు తెలుసు ననుకోండి. జీతం డబ్బులుకూడా ఇస్తామన్న దాని కొక పావలా ఎక్కువే ఇస్తారుగాని లోపం చెయ్యరు. అయితే రెండు విషయాలు తమరిని ముఖ్యంగా కోరదలిచాను," అన్నాడు.

"ఓ, తప్పకుండా కోరు," అన్నాడు భీమన్న.

"వాడికి ప్రతి శనివారమూ అభ్యంగనం అయేటట్టు తమరు చూడాలి," అన్నాడు నౌకరు తండ్రి.

"అభ్యంగన మంటే ఏమిటి?" అని భీమన్న అడిగాడు.

"నూనెతో స్నానం చేయించాలి. ఈ మాట ఎందుకు తమతో ప్రత్యేకంగా మనవి చేస్తున్నానంటే, వాడు నూనె చూడగానే పారిపోతాడు. నూనెలో ఎంతసేపు నానితే అంత మంచిది. అందుచేత బలవంతాన అయినా సరే వాడికి నూనె తలంటు పోయించాలి," అన్నాడు నౌకరు తండ్రి.



"ఓ, అలాగే చేద్దాం," అన్నాడు భీమన్న.

"మరొక్క విషయ మేమంటే నెల కొక క్షవరం వాడి చేత చేయించండి. ఈ రెండే నేను తమరిని ప్రత్యేకంగా కోరేవి!" అన్నాడు నౌకరు తండ్రి.

భీమన్న రెంటికీ అంగీకరించాడు. జ్ఞాపకం ఉంచుకుని ఈ రెండు పనులూ వాడి చేత చేయిస్తానని ఆ మనిషికి మాట కూడా ఇచ్చి పంపేశాడు. ఆ మనిషి తనను స్వయంగా అడిగాడు గనక ఈ పనులు మరొకరికి పురమాయించక, భీమన్న శని వారం ఎప్పుడు వస్తుందా అని రోజులు లెక్కిస్తూ కూచున్నాడు.

శనివారం రానే వచ్చింది. భీమన్న తెల్ల వారుతూనే లేచి, తన నౌకరును పిలిచి, "ఒరే, గిడ్డంగికి పోయి ఒక నూనె డబ్బా తెమ్మన్నానని చెప్పి తీసుకురా!" అన్నాడు.

"అల్లుడుగారు తెమ్మన్నారు. ఎందుకో నాకు తెలియదు," అని గిడ్డంగిలో ఉండే వాడికి చెప్పి నౌకరు నూనెడబ్బా తెచ్చాడు.

భీమన్న తన నౌకరును స్నానాల గదిలోకి తీసుకుపోయి, స్నానం చేసే తొట్టిలో నిలబడ మని, డబ్బాడు నూనె వాడి నెత్తిన దిమ్మ రించాడు. కుర్రాడు లబోమని ఏడుపులం కించు కున్నాడు.


"గొంతు ఎత్తావంటే చంపేస్తాను, వెధవా! నీ సంగతంతా నీ తండ్రి నాతో ముందే చెప్పేశాడు. ఏడిచి గీపెట్టినా సరే నీకు ప్రతి శనివారమూ నూనెతో స్నానం తప్పదు. ఎంత నానితే అంత మంచిదని నీ తండ్రి అన్నాడు. అందుచేత నేను రమ్మన్నదాకా బయటికి రాకు," అని భీమన్న కుర్రాణ్ణి గదమాయించి, స్నానాల గది వులుపు గొళ్ళెం పెట్టి ఇవతలికి వచ్చేశాడు. కుర్రాడు లోపలి నుంచి ఏడుస్తూ పెడబొబ్బలు పెట్టసాగాడు.

సరిగా ఆ సమయానికే భీమన్న భార్య మహాలక్ష్మి అటుగా వచ్చి, "ఏమండీ,

మీ నౌకరలా ఏడుస్తున్నా డెందుకూ? వాణ్ణి లోపల పెట్టి తలుపు మూశారేం? ఏమైనా చేశాడేమిటి?'' అని అడిగింది.

''ఇది నీకు సంబంధించిన విషయం కాదులే. వాడి తండ్రి ఈ బాధ్యత స్వయంగా నా మీద పెట్టాడు. ఏడిచి రాగాలు పెట్టినా సరే వదలకుండా వాడికి ప్రతి శని వారమూ నూనెతో స్నానం చేయించ మన్నాడు. అభ్యంగన మంటే అదేటగా?'' అన్నాడు భీమన్న.

తన భర్త కుర్రాడి నెత్తిన డబ్బాడు నూనె పోసేసిన సంగతి మహలక్ష్మితోబాటు ఇంటిల్లి పాతికీ తెలిసిపోయింది. అల్లుడు గారిలాటి పని ఎందుకు చేశారా అని అందరూ ఆశ్చర్య పడిపోయారు. మహలక్ష్మి వారితో, ''ఆయనకు కోపం వచ్చి చిరాకుతో తన నౌకరు నెత్తిన డబ్బాడు నూనె కుమ్మరించేశారు. ఆయనకు కోపం రావ టానికి కారణమేమంటే, ప్రతి శనివారమూ తలంటు స్నానం చెయ్యటం వారికి అల వాటుట. ఇక్కడ మనకా అలవాటు లేదు. అందుచేత ఆయనకు కోపం వచ్చింది. అందుచేత మన ఇంటకూడా అందరమూ శనివారం శనివారమూ నూనె తలంట్ల ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది,'' అని భర్త అవివేకాన్ని కప్పేసింది. ఈ తలంట్ల



ఏర్పాటు నౌకర్లకు కూడా జరగటంచేత భీమన్న నౌకరు కుర్రాడి నియమాలలో ఒక దాని బెడథ తీరిపోయింది.

కాని రెండో నియమం మిగిలిపోయింది. భీమన్న నెల పూర్తి అయినదాకా కనిపెట్టు కుని ఉండి, నౌకరును పిలిచి, "ఒరే, మన దివాణంలో ఎవరెవరు క్షవరం చేయించు కుంటారో కనుక్కురా!" అన్నాడు.

నౌకరు వెళ్ళి పని వాళ్ళందరినీ అడిగి వచ్చి, "అందరూ చేయించుకున్నారు టండీ," అన్నాడు.

"పోనీ నేనే చేయించుకుంటాను. నీ మంగలికత్తి ఏదీ?" అన్నాడు భీమన్న.

"నా దగ్గిర మంగలి కత్తి లేధరడీ," అన్నాడు నౌకరు కుర్రాడు తెల్లబోయి.

"నెల కొక క్షవరం చేయించమన్నాడు గదా నీ తండ్రి. కత్తి ఎందు కిచ్చాడు కాడూ? పో, ఇంటికి పోయి నీ తండ్రి నడిగి వెంటనే కత్తి పట్టుకువచ్చి నాకు క్షవరం చెయ్యి. ఇలా చేస్తానని నీ తండ్రికి మాట ఇచ్చాను," అన్నాడు భీమన్న.

"నాకు క్షవరం చెయ్యటం చేతకాదు," అంటూ కుర్రాడు లబలబ లాడాడు.

"తెలియకపోతే నేర్చుకోవాలి. నువు వట్టి మొండి వెధవలాగున్నావే. నిన్ను మంచి మంగలిగా తయారు చెయ్యాలని నీ తండ్రి అనుకుంటూంటే నువు తెలియదంటే ఎలా?" అన్నాడు భీమన్న.

మళ్ళీ మహాలక్ష్మి అక్కడికి వచ్చింది. సంగతంతా విన్నది. "వాడి చేతిలో రెండణాల డబ్బులు పెట్టండి. వెళ్ళి క్షవరం చేయించుకువస్తాడు. వాడి తండ్రి మిమ్మల్ని కోరింది అంతే," అన్నది.

"వాడి చేత నెలకొక క్షవరం చేయించ మంటే రెండణా లివ్వమనటమని నా కెలా తెలుస్తుందీ? అడిగేదేదో స్పష్టంగా అడగ కూడదూ?" అని భీమన్న గొణుక్కున్నాడు.

[పై మాసం మరొక సంఘటన]






నౌకరు బదిలీ

గొప్పకోసం జమీందారుగారు తన అల్లుడైన గుండుభీమన్న దగ్గిర ఒక నౌకరు కుర్రాణ్ణి ఏర్పాటు చేశారన్నమాటే గాని ఆ కుర్రాడికి పని ఏమీ ఉండేదికాదు. అసలే కోతి, అందులో పనికూడా లేదు. అందుచేత భీమన్న నౌకరు అస్తమానం గోడలమీదా, గొబ్బెలమీదా, కుర్చీలమీదా, మెట్లమీదా ఎక్కి దూకుతూ ఉండేవాడు.

తన నౌకరు ఇలా అస్తమానమూ కోతి లాగా గెంతుతూంటే భీమన్నకు సరదాగానే ఉండేది. కాని జమీందారుగారికి మటుకు చిరాకు కలిగేది. అల్లుడుగారి నౌకరుగదా అల్లుడుగారే వాణ్ణి అదుపులో పెడతాడు లెమ్మని ఆయన అనుకునేవాడు. అల్లుడు గారు సమీపంలో లేని సమయాల్లోమటుకు, "నీకు కాలూ చెయ్యీ ఊరుకోదురా? క్షణమైనా కుదురుగా ఉండలేవేం?" అని కసిరేవాడు. కుర్రకుంక ఈ కసుర్లు పట్టించుకునేవాడుకాడు; ఆయనకు కనిపించకుండా వెళ్ళి మళ్ళీ తన ఆనందం కొద్దీ గెంతేవాడు.

ఇలా ఉండగా ఒకనాడు గుండుభీమన్న సమక్షంలోనే నౌకరు కుర్రాడు గెంతుతూండటమూ, గుండుభీమన్న వాణ్ణి పల్లెత్తు మాట అనకపోవటమూ జమీందారుగారు తన కళ్ళారా చూశాడు. ఆయన కుర్రాణ్ణి అవతలికి తరిమేసి భీమన్నతో, "ఈ కుర్ర కుంకను ఇలాగే చూస్తూ ఊరుకుంటే నెత్తి నెక్కి కూచుంటాడు. జాగ్రత్త!" అని చెప్పి హెచ్చరిక చేశాడు.

ఈ మాట వినగానే భీమన్నకు దిగులు పట్టుకున్నది. "మామగారు చెప్పిన మాట నిజమే అయి ఉంటుంది. నా నెత్తిన ఎక్కి కూచోపటానికే ఈ కుర్ర వెధవ ఎక్కటమూ, దూకటమూ అభ్యాసం చేస్తున్నాడు. ఎలాగైనా వీడు నా నెత్తిన ఎక్కి కూచోకుండా చూసుకోవాలి. లేకపోతే మామగారు నొచ్చు



కుంటారు," అనుకుని భీమన్న ఒక ఉపాయం చేశాడు. నౌకరును పిలవ వలిసి వచ్చినప్పుడల్లా ముందుగా నెత్తిన ఒక పెద్ద తలపాగా పెట్టుకుని, దానిమీద చేతులుంచుకుని, నౌకరును పిలిచి, వాడికి చెప్పవలిసిన పని చెప్పి, వాడు వెళ్ళినాక నెత్తి మీది నుంచి తన చేతులూ, తలపాగా తీసేసేవాడు. అప్పటికీ వాడు నెత్తిన ఎక్కి కూచుంటాడేమోనని, కుర్రాడు వెళ్ళిపోయేదాకా ఒక చోట కూచోక, భీమన్న అటూ ఇటూ పచార్లు చేస్తూ కుర్రాడితో మాట్లాడేవాడు.

ఒకనాడు భీమన్న నెత్తిన పెద్ద తలపాగా, దాని పైన తన చేతులూ పెట్టుకుని అటూ ఇటూ పచారు చేస్తూ ఏదో పని చెబుతూండటం మహలక్ష్మి కంట పడింది. ఆమె తన భర్తను, "ఈ తలపాగా ఏమిటండీ?" అని అడిగింది.

నౌకరు కుర్రాణ్ణి పంపేసి భీమన్న తన భార్యతో, "నీకేం తెలుసు? చూస్తుండగానే ఈ కుర్రాడు నా నెత్తిన ఎక్కి కూచుంటాడట. మామగారు చెప్పారు. అనుభవం ఉన్నవారు గనక ఆయన బాగా కనిపెట్టారు. ఆయన అన్నది అక్షరాలా నిజమే. ఎంచేతనంటే వీడు నా నెత్తిన ఎక్కి కూచోవటానికే అవీ ఇవీ ఎక్కి దూకటం అభ్యాసం చేస్తున్నాడు. నేను జాగ్రత్తగా కనిపెడుతున్నానుగా!" అన్నాడు.

మహలక్ష్మి నవ్వి, "నాన్నగారి ఉద్దేశం అదికాదు. చనువిస్తే కుర్రాడికి గర్వం వచ్చి చెప్పిన మాట వినడని. అంతేగాని వాడు మీ నెత్తి మీదికి ఎక్కనే ఎక్కడు భయపడకండి," అన్నది భర్తతో.

భీమన్నకు పెద్ద బరువు దించేసినట్టయింది. తను చెప్పేది కుర్రవాడికి వినపడని పరిస్థితి ఇంకా రాలేదు. వాడు తన నెత్తి మీద ఎక్కి కూచోడని మహలక్ష్మి నమ్మకంగా చెప్పేసింది. అందుచేత భీమన్న కుర్రాడితో ఎప్పటిలాగే ఉండసాగాడు.

ఒకనాడు భీమన్న కుర్రాణ్ణి పిలిచి కాసిని నీళ్ళు పట్టుకురమ్మన్నాడు. కుర్రాడు చిన్న లోటాలో నీళ్ళు తెచ్చాడు.

"అవి చాలవురా! కాస్త పెద్ద చెంబుతో పట్రా!" అన్నాడు భీమన్న.


"ఆ మాట మొదటే చెబితే చెంబుతోనే తెచ్చేవాణ్ణిగా?" అన్నాడు కుర్రాడు.

అయితే కుర్రాడు భీమన్నతో అన్న ఈ మాట, అటుగా వెళుతున్న జమీందారు గారికి వినిపించింది. ఆయన భీమన్న దగ్గిరికి వచ్చి, "ఆ కుర్రకుంకను అలా ఎదురు జవాబు చెప్పనివ్వవచ్చా? ఇలా చేస్తేనే వాడు నెత్తికెక్కేది!" అని గట్టిగా హెచ్చరించాడు.

భీమన్న మామగారితో, "వాడు నెత్తి కెక్కడుట లెండి. ఆ మధ్య మహలక్ష్మి నాతో చెప్పింది," అన్నాడు.

"దాని మొహం! చిన్నపిల్ల దానికేం తెలుసు? ఎదురు జవాబు చెప్పనిస్తే వాడు తప్పక నెత్తి కెక్కుతాడు!" అంటూ జమీందారుగారు వెళ్ళిపోయాడు.

భీమన్నకి మళ్ళీ గుండెల్లో రాయిపడింది. మహలక్ష్మి తప్పు చెప్పింది. ఆమెకు ఏమీ తెలీదు. మామగారు చెప్పిందే నిజం. ఆయన పెద్దవాడు; అనుభవం గలవాడు.



అందుచేత కుర్రాడు తనకు ఎదురు జవాబు ఇవ్వకుండా చూసుకోవాలి.

అందుకని భీమన్న కుర్రాణ్ణి పిలిచి, "ఒరే, ఇకముందు నా కేదన్నా జవాబిచ్చే టప్పుడు నా కెదురుగా నిలబడక అటు తిరిగి నిలబడు, తెలిసిందా?" అన్నాడు.

కుర్రాడు బుర్ర గోక్కుని, "తెలవ లేదండీ!" అన్నాడు.

వాడికి చెప్పి లాభం లేదనుకుని భీమన్న వాడు మాట్లాడేటప్పుడల్లా తానే పెడ మొహం పెట్టి నిలబడేవాడు. కుర్రాడు తన ఎదటికి వచ్చి మాట్లాడటానికి యత్నించి నప్పుడల్లా భీమన్న మరొక పక్కకు తిరిగేవాడు.

ఒకనాడు ఈ వింత మహలక్ష్మి కళ్ళ పడింది. భీమన్న తన చుట్టూ తాను తిరుగుతూ కుర్రాణ్ణి ఏదో అడుగుతున్నాడు, కుర్రాడు భీమన్న చుట్టూ తిరుగుతూ జవాబు జెబుతున్నాడు! మహలక్ష్మి, "ఈ రంగుల రాట్నం ఏమిటండీ?" అని అడిగింది.

"మరేం లేదు. కుర్రాణ్ణి ఎదురు జవాబు ఇవ్వనివ్వ వద్దనీ, ఇవ్వ నిస్తే వాడు నిశ్చయంగా నా నెత్తి కెక్కుతాడనీ మామగారు మళ్ళీ చెప్పారు. ఎదురుగా నిలబడి జవాబు చెప్పకురా అంటే కుర్ర వెధవకు అర్థం కావటంలేదు. వాడు నా ఎదటికే వచ్చి జవాబు చెబుతాడు. నా నెత్తిన ఎలాగైనా ఎక్కాలని వాడికి బాగా ఉన్నట్టుంది. అందుచేత నేనే వాడికి పెడమొహ మవుతున్నాను. అంతకంటె ఏమీ లేదు," అన్నాడు భీమన్న తన భార్యతో.

ఈ మాటలు విని మహలక్ష్మి విరగబడి నవ్వి, "ఎదురు జవాబు లివ్వటమంటే ఎదురుగా నిలబడి జవాబు లివ్వటం కాదండీ. మంచీ మర్యాదా లేకుండా పొగరుగా జవాబివ్వటమన్నమాట. పనివాళ్ళు వినయ విధేయతలుగా ఉండాలని నాన్నగారి ఉద్దేశం," అన్నది.


"నీకేం తెలుసు? నువ్వింకా చిన్నదానివి. వాడు నా నెత్తి నెక్కడని నువు తెలీక అన్నావుట. మామగారు స్పష్టంగా చెప్పారు. పెద్దవారి మాట కాదనటం ఎట్లా?" అన్నాడు భీమన్న.

ఈ నౌకరు కుర్రాడి మూలంగా తన భర్త క్షోభపడి పోతున్నాడని మహలక్ష్మి గ్రహించి, "ఇదంతా ఎందుకు? ఈ కుర్ర కుంకను నా పనికి పెట్టుకుంటాను. మీకు మరో నౌకరును చూద్దాం లెండి," అన్నది.

"అలాగే చెయ్యి, నీకు పుణ్యం ఉంటుంది. వీడు వదిలితే చాలు, మరొకణ్ణి పెట్టుకున్నంత సుఖం," అన్నాడు భీమన్న.

(పై సంచికలో మరో సంఘటన)





రాక్షసుడు

తన భర్తకు చదువు సంధ్యలు లేకపోవటం ఏమీ బాగా లేదనుకుని మహలక్ష్మి భీమన్న చేత అక్షరాభ్యాసం చేయించింది. జమీందారుగారి అల్లుడై ఉండి చదవటమూ, రాయటమూ చేతకాకపోవటమేమిటని భీమన్నకు కూడా అనిపించింది. అందుచేత అతను శ్రద్ధగా చదువుకుని పుస్తకాలు చదివే దశకు వచ్చాడు.

జమీందారుగారు కూడా చదువులో అల్లుడికి సహాయపడ్డాడు.

ఆయన భీమన్నతో, "మన జమీందారీ వ్యవహారాలు నువ్వు కొంచెం కొంచెం తెలుసుకోవటం అవసరం. అందుచేత నేను చదివేది ప్రతిదీ నువ్వు కూడా చదువుతూ ఉండు. అన్ని విషయాలూ క్రమంగా నీకే తెలుస్తాయి," అన్నాడు.

భీమన్నకు ఎన్ని ఉత్తరాలు చదివినా జమీందారీ వ్యవహారాలు తల కెక్కలేదు గాని, తన మామగారు చదివేదెల్లా తానూ చదవాలన్నది మాత్రం గట్టిగా అర్థమయింది.

జమీందారుగారు ప్రతి రాత్రీ రామాయణం చదివి, కళ్ళజోడు తీసి రామాయణం మీద పెట్టి, వెళ్ళి పడుకుని నిద్రపోయేవాడు. అందుచేత భీమన్న తాను కూడా అలాగే చెయ్యాలనుకున్నాడు.

రాత్రి అయి అందరూ పడుకునే సమయానికి భీమన్న పడుకో లేదు; మామగారు రామాయణం చదివి పడుకోబోయేదాకా వేచి ఉండి, "నేను కాస్సేపు చదువుకుని వస్తాను, నువ్వు పడుకో," అని మహలక్ష్మితో చెప్పి, మామగారి కళ్ళజోడు తాను తగిలించుకుని రామాయణం చదవటానికి కూచున్నాడు.

జమీందారుగారిది చత్వారపు జోడు. ఆయన వయసు మళ్ళినవాడు కనక ఆ కళ్ళజోడు లేకపోతే చదవలేక పోయేవాడు.

భీమన్నకు చత్వారం లేకపోవటంవల్ల ఆ జోడు పెట్టుకుని చదవ నారంభిస్తే కళ్ళకు శ్రమ అయింది.

అలాగే శ్రమ పడుతూ భీమన్న కొంచెం సేపు చదివే సరికి కళ్ళు వాటంతట అవే మూసుకుపోయి కునుకు వచ్చేసింది. కాస్సేపు కునికి మళ్ళీ కళ్ళు తెరిచి భీమన్న మరి కొంచెం సేపు చదివి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఇలా కునికిపాట్లు పడుతూ భీమన్న రామాయణంలో రాముడు రాక్షసులను చంపే ఘట్టం చదవసాగాడు.

భీమన్న ఒకసారి ఇలాగే కునుకుతూ కళ్ళు తెరిచే సరికి ఎదురుగా ఒక నల్లని ఆకారం కనిపించింది.

ఆ వచ్చిన వాడొక దొంగ. ఇల్లంతా మాటుమణిగి ఉన్న సమయంలో జమీందారుగారింట దొంగతనం చేసే ఉద్దేశంతో వాడు నల్లటి బట్టలు వేసుకుని, ముఖానికీ చేతులకూ మసి పూసుకుని వచ్చాడు. కాని నిద్ర మత్తులో ఉన్న భీమన్నకు వాడు రామాయణంలోని రాక్షసుడులాగా కనిపించాడు. రాముడు రాక్షసులను అడిగినట్టే భీమన్న, "ఒరే, రాక్షసుడా? నీ పేరేమిటి? ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని గద్దించి అడిగాడు.

"అరవకు! నోరెత్తావంటే చంపేస్తా!" అంటూ దొంగ భీమన్నను సమీపించాడు.

భీమన్నకు రాక్షసుణ్ణి చూస్తున్న కొద్దీ ఆగ్రహం రెచ్చిపోయింది. అతను దొంగ కత్తి పట్టుకున్న చేతిని ఒక చేత గట్టిగా పట్టుకుని, రెండో చేత్తో వాడి పీక పట్టుకున్నాడు. దొంగ ఒక్క చావు కేక పెట్టి కింద పడిపోయాడు. ఆ అలికిడికి ఇంటో వాళ్ళంతా లేచి వచ్చారు. దొంగ దొరికిపోయాడు. వాడు పేరు మోసిన దొంగ కావటంచేత, వాణ్ణి పట్టుకున్నందుకు భీమన్న ఖ్యాతి చాలాదూరం పాకింది.

[పై మాసం మరొక సంఘటన]





మోసగాడు

భీమన్నను తెలివిగల వాణ్ణి చెయ్యటానికి మహాలక్ష్మి చేసిన ప్రయత్నాలేవీ ఫలించ లేదు. అందుచేత ఆమె అతనిలో దైవభక్తి ప్రేరేపించి తెలివితేటలు పెంపొందించే ఏర్పాటు చేసింది. భార్య ప్రేరేపణతో భీమన్న ప్రతి సాయంకాలమూ ఊరి బయట ఉండే గుడికి వెళ్ళి దేవుడికి దణ్ణం పెట్టుకుని ఇంటికి తిరిగి వచ్చేవాడు.

ఇలా ఉండగా ఒక మోసగాడు ఆ ఊరు చేరి, గుడి పక్కన ఉండే చెరువు దగ్గిర చెట్టు కింద ఒక మునిలాగా వేషం వేసుకుని కూచుని వచ్చేపోయే వాళ్ళద్వారా గ్రామ పరిస్థితులన్నీ గ్రహించసాగాడు.

ఈ మోసగాడు భీమన్నను గురించి కూడా తెలుసుకున్నాడు. భీమన్న జమీందారుగారి అల్లుడూ, అమాయికుడూనూ. అందుచేత ఒకనాటి సాయంకాలం భీమన్న గుడికి వెళుతూండగా మోసగాడు అతన్ని చూసి, "వస్తున్నావా, బిడ్డా, భీమన్నా! రా, రా!" అని పిలిచాడు.

మనిషి చూడబోతే మునీశ్వరుడులా గున్నాడు. తనను పేరు పెట్టికూడా పిలిచాడు; అందుచేత భీమన్నకు క్షణంలో ఆ మోసగాడి పైన భక్తి కుదిరింది. అతను మోసగాడి వద్దకు వెళ్ళి, సాష్టాంగ నమస్కారం చేసి లేచి, "ఏమి, స్వామీ?" అని అడిగాడు.

"బిడ్డా, నీవు దేవుడి దర్శనానికి ఆరాట పడుతున్నావని నేను గ్రహించాను. అందుకే రోజూ దేవాలయానికి పోయి వస్తున్నావు. నీ భక్తి చాలా గొప్పది, కాని దేవాలయంలో నీకు దేవుడి దర్శనం ఎలా అవుతుంది, నాయనా? ఆలయంలో ఉండేది దేవుడి విగ్రహమేగాని దేవుడుకాడే! నీకు దేవుళ్ళను ప్రత్యక్షంగా చూపుదామని పిలిచాను. నిజంగా దేవుళ్ళ దర్శనం చేసుకోవాలని

నీకున్నదా?'' అని మోసగాడు అడిగాడు.

"లేకపోవట మేమిటి, స్వామీ? ఆ దేవుళ్ళు ఎక్కడున్నారు? ఎలా కనిపిస్తారు?'' అని భీమన్న మోసగాణ్ణి అడిగాడు.

"అది నా చేతిలో ఉన్నదే, నాయనా! నేను రమ్మంటే వాళ్ళు వస్తారు. వారిని చూచినాక నీ సమస్త కోరికలూ తీరిపోతాయి. నీ జన్మ తరిస్తుంది. కాని నేను చెప్పినట్టుగా నీవు చేయాలి,'' అన్నాడు మోసగాడు.

"అలాగే చేస్తాను, స్వామీ,'' అన్నాడు భీమన్న భక్తిగా.

"అయితే విను. నీవు నీ చొక్కా విప్పి ఇక్కడ పెట్టు. నీ వంటి మీద ఉన్న ఉంగ రాలూ, బంగారు మొలతాడు, మెడలో గొలుసూ అవీ తీసి చెరువులో దిగి మునిగి ఉండు. కొద్ది సేపట్లోనే దేవతలు నీకు కనిపిస్తారు,'' అన్నాడు మోసగాడు.

భీమన్న సరేనని తన ఒంటిపైన ఉండే నాలుగు సొమ్ములూ తీసి, చొక్కా విప్పి, అన్నిటినీ చెరువు గట్టుపై ఉంచి, నీటిలోకి దిగి మునిగి అలాగే ఉండిపోయాడు. భీమన్న నీటిలో మునిగిన మరుక్షణం మోసగాడు అతని చొక్కా, నగలూ పట్టుకుని గుడి దిక్కుగా పారిపోసాగాడు.

ఈలోపల నీటిలో మునిగిన భీమన్నకొక ఆలోచన వచ్చింది. అదేమిటంటే, తనకు



దేవతలు కనిపిస్తారుగాని ఆ దేవతలను తానొక్కడే చూస్తాడు; తన భార్య చూడదు. ఇది అన్యాయం. మునీశ్వరుడి ఆజ్ఞ పొంది మహాలక్ష్మిని కూడా పిలుచుకు వచ్చే ఉద్దేశంతో భీమన్న నీటిలో నుంచి పైకి లేచేసరికి, పారిపోతున్న మునీశ్వరుడు కనిపించాడు.

"స్వామీ, స్వామీ! కొంచెం ఆగండి! ఒక్క మాట!" అని కేకలు పెడుతూ భీమన్న మోసగాడి వెంట పడ్డాడు. భీమన్న గొంతు విని మోసగాడు మరింత పిక్కబలం చూపాడు. అయితే భీమన్న బలశాలీ, దమ్ము గలవాడూ కావటంచేత త్వరలోనే మోసగాణ్ణి అందుకుని, పట్టుకుని, "మీరు దేవుళ్ళను పిలుచుకు రావటానికి వెళుతున్నారులాగుంది. అందుకు తొందర ఏమీలేదు. కొంచెం నిలవండి!" అన్నాడు.

మోసగాడికి గుండెదడ క్షణక్షణానికీ హెచ్చి పోతున్నది. వాడు తన చేతిలో ఉన్న భీమన్న చొక్కా, నగలూ కింద పారేసి, ఎట్లాగో భీమన్న పట్టు నుంచి తప్పించుకుని మళ్ళీ పరిగెత్తసాగాడు.

"స్వామీ, నా మాట వినకుండా ఎందుకు వెళ్ళిపోతున్నారు? ఇంతలోనే నాపై తమకెందుకు కోపం వచ్చింది?" అంటూ భీమన్న మోసగాడి వెంట పడ్డాడు.

ఈ కేకలు విని గుడిలో వాళ్ళంతా బయటికి వచ్చి మోసగాడి దారికి అడ్డు తగిలారు. వాడు భీమన్నకు చిక్కనే చిక్కాడు. నలుగురూ చేరి వాడి పెట్టుడు గడ్డాలూ, మీసాలూ పీకేసి, వాడు దొంగ అని తేల్చారు. తీరా విచారించగా వాడు పెద్ద దొంగ అనీ, ఎన్నో గ్రామాలలో ఎందరినో మోసగించాడనీ తేలింది. అటువంటి దొంగను జమీందారుగారి అల్లుడుగారు పట్టుకున్నాడని ఆ చుట్టుపక్కల చాలా ఏళ్ళపాటు గొప్పగా చెప్పుకున్నారు.

[పై మాసం మరొక సంఘటన]





నిజంలాంటి కల

పొరుగూళ్ళో జమీందారుగారి బంధువుల యింటి ఒక అమ్మాయి మరణించింది. పరామర్శించటానికి జమీందారుగారి ఇంటిల్లిపాదీ, భీమన్నతో సహా, బయలుదేరి వెళ్ళారు. శవం చుట్టూ చేరి అందరూ గొల్లున ఏడుస్తూంటే భీమన్నకు కూడా ఏడుపొచ్చింది. ఇటువంటి సన్నివేశాలు అతనెన్నడూ ఎరగడు. శవానికి స్నానం చేయించటమూ, అలంకరించటమూ, బ్రాహ్మణులు మంత్రాలు చదవటమూ, శవాన్ని శ్మశానానికి తీసుకుపోయి దహనం చేయటమూ, భర్త తన చేతి మీదుగానే, చనిపోయిన భార్యను ఇంత బూడిద చెయ్యాటమూ—ఇదంతా భీమన్న తలలో బాగా నాటుకుపోయింది.

దహనసంస్కారాలయాక కూడా భీమన్నకు ఆ సంగతులే తలలో మెదిలాయి; ఆ దృశ్యాలే కళ్ళ ఎదట కదిలాయి. ఆ రాత్రి అతనికి కలలో కూడా ఆ సంఘటనలే వచ్చాయి. కాని వ్యక్తులు మారారు. తన భార్య మహలక్ష్మి చనిపోయిందిట. అందరూ ఏడిచారుట. మహలక్ష్మికి స్నానం చేయించి, అలంకరించి, శ్మశానానికి తీసుకుపోయారుట. తాను నిప్పు పట్టుకుని మహలక్ష్మి శవం వెంట నడిచాడట. శ్మశానంలో చితిపేర్చి మహలక్ష్మిని దానిపైన పడుకోబెట్టారట. చితికి తానే నిప్పు పెట్టాడట. క్షణంలో మహలక్ష్మి బూడిద అయిపోయిందట. నిద్రలోనే భీమన్న పెద్ద పెట్టున ఏడవసాగాడు.

పక్కనే పడుకుని నిద్రపోతున్న మహలక్ష్మి లేచి, అతన్ని తట్టి లేపి, "ఎందుకలా మూలుగుతున్నారు?" అని అడిగింది.

భీమన్న తన భార్య గొంతు విని ఉలిక్కిపడి లేచి, మహలక్ష్మిని చూసి కంగారు పడుతూ, "నువ్వు చనిపోయావు. నేను

నిన్ను దహనం చేశాను. నువు దయ్యా నివి!" అన్నాడు.

మహలక్ష్మి నవ్వి, "మీ కేదో పీడ కల వచ్చి ఉంటుంది. నేను చావలేదు. ఇదుగో, బతికే ఉన్నాను," అన్నది.

భీమన్నకు వచ్చిన కల ఎంత స్ఫుటంగా ఉన్నదంటే అది అతని ప్రాణానికి నిజం గానే తోచింది. అందుచేత అతను తన భార్య మాటలు నమ్మలేక, "కాదు, నువు దయ్యానివే!" అంటూ గది మూలవెళ్ళి కూచుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అతని అపోహ ఎలా తొలగించాలో మహ లక్ష్మికి అర్థం కాలేదు.

తెలతెలవారుతూండగానే భీమన్న లేచి తన బట్టలు సర్దుకో నారంభించాడు.

"ఎక్కడికి ప్రయాణం?" అని మహ లక్ష్మి అడిగింది.

"నే నిక్కడ ఉండను. మా బామ్మ యింటికి వెళ్ళిపోతాను," అన్నాడు భీమన్న.

"సరే, వెళ్ళి మీ బామ్మ ఎలాగున్నారో చూసి రండి. అక్కడికి వెళుతున్న సంగతి ఎవరికీ చెప్పకండి," అన్నది మహలక్ష్మి.

భీమన్న ఎవరితోనూ ఏమీ చెప్పకుం డానే బామ్మ యింటికి బయలుదేరాడు. అతనికి ఎన్నడూ కలలు రాని కారణంచేత ఈ కల అతనికి వాస్తవంగానే ఉన్నది.



మర్నాడు జమీందారు గారింటో వాళ్ళు, అల్లుడుగా రెక్కడ అని ప్రశ్నించుకుంటూంటే మహలక్ష్మి, "ఆయనకు రాత్రి ఏదో పాడు కల వచ్చిందిట. ఒక్కసారి వాళ్ళ బామ్మను చూసి వస్తానని తెల్లారక ముందే బయలుదేరి వెళ్ళారు," అన్నది.

బామ్మ ఉండే ఊరుకు రెండు రోజుల ప్రయాణం. అందుచేత పగలల్లా నడిచి భీమన్న ఒక సత్రంలో పడుకున్నాడు. ఆ రాత్రి అతనికి మళ్ళీ కల వచ్చింది. బామ్మ చచ్చిపోయినట్టూ, అందరూ. ఆమె చుట్టూ చేరి ఏడ్చినట్టూ, తానే బామ్మకు తలకొరివి పెట్టినట్టూ భీమన్న కలగన్నాడు. ఆ కలలోనే అతను పెద్దపెట్టున ఏడుస్తూ, "నా భార్య పోయింది. బామ్మా పోయింది. ఇంక నేను బతికి ఎందుకు?" అంటూ బామ్మ బూడిదలో పొర్లిగింతలు పెట్టాడు.

ఇంతలో భీమన్నకు మెలకువ వచ్చింది. అతను నిర్ఘాంతపోయి చుట్టూ కలయజూశాడు. తాను శ్మశానంలో లేడు, సత్రంలో ఉన్నాడు. తన బట్టలకు బూడిద ఏమాత్రమూ అంటలేదు. తాను చూసిందంతా భ్రమ అయి ఉంటుందా అని భీమన్నకు అనుమానం తగిలింది. ఆ అనుమానంతోటే బామ్మ ఇల్లు చేరుకున్నాడు. బామ్మ బతికే ఉన్నది—చచ్చిపోలేదు. ఆమె భీమన్నను కుశల ప్రశ్నలు వేసి, వాడి రాకకు కారణం అడిగింది. భీమన్న దాచకుండా అంతా చెప్పేశాడు.

అంతా విని బామ్మ, "వెర్రి సన్యాసీ! నీ పెళ్ళాం చెప్పినదే నిజం—అదంతా కల. కలను నిజమనుకున్నావు. నీకు కల అంటే ఏమిటో కూడా తెలీదు. అందుకే మహలక్ష్మి చెప్పినట్టు వింటూ ఉండు," అని హితబోధ చేసింది.

ఒక పూట బామ్మ చేతి వంట తిని భీమన్న అత్తవారింటికి తిరిగి వచ్చేశాడు.

[పై సంచికలో మరొక సంఘటన]





వెంకటప్ప సంకటం

భీమన్న మామగారైన జమీందారుగారిని ఆశ్రయించి తిరిగే వారిలో వెంకటప్ప అనే వాడొకడుండే వాడు. వాడు జమీందారుగారి మనసు కనిపెట్టి మాట్లాడుతూ, తియ్యటి కబుర్లు చెబుతూ, ఎంతో పెద్ద మనిషిలాగా నటిస్తూ, అక్కర వచ్చినప్పుడు జమీందారు గారి వద్ద ధన సహాయం పొందుతూ సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు.

జమీందారుగారికి వెంకటప్ప మీద సదభిప్రాయం ఉండటంచేత ఆయన వెంకటప్పకు ఇచ్చిన డబ్బు తిరిగి పుచ్చుకునేవాడుకాడు. ఆ సంగతి తెలిసి వెంకటప్ప జమీందారు గారి వద్ద ధనం పుచ్చుకున్నప్పుడల్లా బాకీ చెల్లించటానికి ప్రయత్నించేవాడిలా ఆయన వద్ద నటించేవాడు.

ఈ విధంగా జమీందారుగారి ప్రాపకం సంపాదించుకుని సుఖంగా కాలక్షేపం చేస్తున్న వెంకటప్ప స్వతహాగా పెద్ద మనిషి కాని కారణం చేత తన గొయ్యి తానే తవ్వుకున్నాడు. ఆయన ఊళ్ళో అనేక మందితో, "జమీందారుగారి అల్లుడు వట్టి వెర్రి వెంగళప్ప. అటువంటి వాడికి కూతురు నివ్వటంలో జమీందారుగారు చాలా తొందర పడి తెలివి తక్కువగా ప్రవర్తించాడు. ఆయనకు పట్టుదలే తప్ప తెలివితేటలు తక్కువ," అని పేలాడు.

జమీందారుగారంటే గౌరవంగలవాళ్ళూ, వెంకటప్పను చూసి అసహ్య పడేవాళ్ళూ, 'వీడికి జమీందారు ప్రాపకం లభించిందే!' అని అసూయ పడేవాళ్ళూ గ్రామంలో ఉన్నారు. వాళ్ళు జమీందారుగారితో వెంకటప్ప అనే మాటలు చెప్పేశారు. వెంకటప్ప అంటే మంచి అభిప్రాయం ఉండటం చేత జమీందారుగారు మొదట్లో ఈ మాట నమ్మలేకపోయాడు. కాని ఒకరికి నలుగురు చెప్పాక జమీందారుగారికి



వెంకటప్ప పెద్ద మనిషి కాడని రూఢిగా తెలిసిపోయింది. ఆయనది మంచి స్వభావమే గాని మనసు మహా పెళుసు. అది విరిగితే మరి అతకదు. అందుచేత ఆయనకు వెంకటప్ప మీద చెప్పరానంత ద్వేషం పుట్టుకొచ్చింది. ఈ ద్వేషాన్ని ఆయన తన మనస్సులోనే దాచుకున్నాడు.

జమీందారుగారి మనసులో కలిగిన ఈ మార్పు గురించి వెంకటప్పకు ఏమాత్రమూ తెలియదు. అతను జమీందారు గారి నుంచి ఏదో సహాయం పొందగోరి ఒక నాడు జమీందారుగారింటికి వచ్చి, నౌకరుతో తాను వచ్చానని జమీందారుగారితో చెప్ప మని కబురు చేశాడు.

"నా కోసం వెంకటప్ప వచ్చాడా? తక్షణం వెళ్ళి పొమ్మను. ఎన్నడూ నా గడప తొక్క వద్దని చెప్పు!" అని జమీందారుగారు నిప్పులు కక్కాడు.

"జమీందారుగారు తమర్ని చూడరట. ఈ చాయలకు రావద్దని కూడా మీకు గట్టిగా చెప్పమన్నారు," అని నౌకరు వెంకట ప్పతో చెప్పాడు.

· వెంకటప్పకు ఈ మాట విని ఆశ్చర్యం కలిగింది. అతను తన చెవులను తానే నమ్మలేక, "నువ్వేదో తప్పు విని ఉంటావు. ఫలాని వెంకటప్పగారు వచ్చారనీ, ఒక్క నిమిషం సేపు మాత్రమే మాట్లాడతారనీ చెప్పు," అని నౌకరును మళ్ళీ లోపలికి పంపాడు.

"నీకు బుద్ధి లేదురా? ఆ వెంకటప్పను ఒక్క క్షణంపాటు కూడా చూడననీ, నాకు వాడి ముఖం చూపించ వద్దనీ గట్టిగా చెప్పు," అని జమీందారుగారు నౌకరు మీద మండిపడ్డాడు.

నౌకరు వచ్చి జమీందారుగారన్న మాటలు వెంకటప్పతో చెప్పాడు. తనమీద జమీందారు గారికి ఎందుకో కోపం వచ్చిందనీ, తనమీద ఎవరో చాడీలు చెప్పి ఉంటారనీ వెంక

టప్పకు అర్థమయింది. జమీందారుగారికి తనపై కలిగిన దురభిప్రాయాన్ని మొగ్గలోనే తుంచి వెయ్యకపోతే తన భవిష్యత్తుకు చాలా నష్టమున్నదని గ్రహించి వెంకటప్ప బయటి అరుగు మీద బైఠాయించి, "సరే వారి దయ! వారు బయటికి వచ్చినదాకా ఇక్కడే కూచుంటాను," అని నౌకరుతో అన్నాడు.

నౌకరు లోపలికి వెళ్ళి, వెంకటప్ప బయట అరుగు మీద తిష్ఠ వేసినట్టు జమీందారుగారితో చెప్పాడు. జమీందారు గారికి పట్టరాని ఆగ్రహం వచ్చింది, వెంకటప్పను ఎలా సాగనంపాలా అని ఆయన ఆలోచించేటంతలో అల్లుడు భీమన్న ఆయన ఉన్న చోటికి వచ్చాడు.

వెంటనే ఆయన భీమన్నతో, "చూడు, నాయనా! వెంకటప్ప తెలుసు కాదూ? వాడు నన్ను చూడాలని వచ్చి వాకిట ఉన్నాడట. వాడి ముఖం చూడటం కూడా నా కిష్టంలేదు. అందుకని నౌకరుతో చెప్పిస్తే వాడు వినిపించుకో లేదు. నువు వెళ్ళి వాడితో ముఖాన కొట్టినట్టుగా చెప్పెయ్యి, తెలిసిందా? మాటంటే మాటే! ఎలా చెబుతావో, కర్ర విరిచినట్టుగా చెప్పాలి. వాడు ఏనాడూ తిరిగి మన గుమ్మం తొక్కకుండా చెయ్యి!" అన్నాడు.

"అదెంత పని, మామగారూ!" అంటూ భీమన్న బయటికి వచ్చాడు. బయటికి వెళ్ళే టప్పుడు మూల నుంచి ఒక కర్ర తీసుకుని బయటికి వచ్చాడు. భీమన్న వెంకటప్పను సమీపించి కర్రతో అతడి ముఖం మీద గట్టిగా కొట్టి, "నీ ముఖం ఇక్కడ ఎన్నడూ చూపించకు!" అన్నాడు. తరవాత కర్రను పెఢీ మంటూ రెండుగా విరిచి, "మాటంటే మాటే!" అన్నాడు.

వెంకటప్ప ప్రాణాలు దక్కించుకుని పారిపోయాడు. అతను మళ్ళీ జమీందారు గారి గుమ్మం తొక్కిన పాపాన పోలేదు.

[పై సంచికలో మరొక సంఘటన]





శిశురోదన

ఎవరికైనా పెళ్ళి కావటం వ్యవధానంగా చుట్టుపక్కల అమ్మలక్క లందరూ వాళ్లకు పిల్ల లెప్పుడు పుడతారా అని ఆరాట పడి పోతారు. మహలక్ష్మికి పెళ్ళయి రెండేళ్ళు కావచ్చింది. కాని ఇంకా ఒక నలుసు ఆమె కడుపున పడలేదు. అమ్మలక్కలు ఒక నాడు జమీందారుగారి భార్యతో ఈ విషయమే ముచ్చటించారు.

ఒక పెద్ద ముత్తయిదువు ఇలా అన్నది :

"పోనీ అమ్మాయి చేత ఏదైనా వ్రతం చేయించండి. బిడ్డలుంటేనే ఇంటికి అందమూ చందమూనూ. ఇంట బిడ్డ నవ్వితే దేవతలు వస్తారనీ, బిడ్డ ఏడిస్తే దయ్యాలు పోతాయనీ అంటారు పెద్దలు."

బిడ్డ ఏడిస్తే దయ్యాలు పోతాయన్న ముక్క భీమన్న చెవిన పడింది. ఆడవాళ్ళు మాట్లాడుకుంటున్న అసలు విషయమేమిటో వాడు ఎరగడు. దయ్యా లింత సులువుగా పోతాయని వినేసరికి వాడికి అశ్చర్యమయింది. ఎందుకంటే జమీందారుగారి తోట ఇంట్లో దయ్యాలున్నాయని ప్రతీతి. వాటిని తరిమివెయ్యటానికి ఎవరూ ప్రయత్నించకపోగా, ఏటా ఆ దయ్యాలకు జాతర్లలాటివేవో చేసి, బలులు కూడా ఇచ్చేవారు. ఇదంతా భీమన్నకు చాలా చిరాకుగా ఉంటూండేది.

వాడు ఒకటి రెండు సార్లు ఈ దయ్యాల జాతర్లను గురించి ప్రస్తావించి, "దయ్యాలకి నిండు ప్రాణాలను బలి ఇవ్వట మేమిటి? వాటిని వదలగొట్టటానికి మరో మార్గం లేదా?" అని అడిగాడు.

"అమ్మయ్యో, దయ్యాలను గురించి అలా మాట్లాడరాదు. వాటి ఊసే ఎత్తగూడదు," అని మహలక్ష్మి వాణ్ణి హెచ్చరించింది. ఆ తరవాత వాడు దయ్యాల ప్రస్తావన భార్య దగ్గిర తీసుకు రాలేదన్న

మాటే గాని, వాటిని ఎలా వదిలించటమా అని లోపల ఆలోచిస్తూనే ఉన్నాడు. ఇంత కాలానికి ఆ కిటుకు వాడికి తెలిసిపోయింది. బిడ్డలు ఏడిస్తే చాలు దయ్యాలు పారిపోతాయి. ఈ మాటలు పెద్దలే చెప్పారు గనక ఇందులో అబద్ధం ఏమీ ఉండదు.

దయ్యాలను వెళ్ళగొట్టే ఉపాయంతో బాటే సాధనం కూడా భీమన్నకు అందుబాటులో ఉన్నది. జమీందారుగారి ఇంటి నౌకర్లలో సిద్దప్ప అనే వాడి భార్య ఇటీవలనే ప్రసవించింది. ఆ బిడ్డను మధ్య పడుకోబెట్టుకుని సిద్దప్పా, వాడి భార్యా వెనక వసారాలో పడుకుంటారు. ఆ బిడ్డ ఏడుపు సహాయంతో తోట యింటి దయ్యాలను పారదోలటానికి భీమన్న నిశ్చయించాడు.

అర్ధ రాత్రివేళ అందరూ గాఢ నిద్రలో మునిగి ఉన్న సమయంలో భీమన్న లేచి, చప్పుడు చెయ్యకుండా వెనక వసారాకు వెళ్ళి, సిద్దప్ప బిడ్డను ఎత్తుకుని చకచకా తోట యింటికి వెళ్ళాడు. బిడ్డను ఇంటి మధ్య పడుకోబెట్టి అది ఎప్పుడు ఏడుస్తుందా అని కొంతసేపు చూశాడు. కాని ఎంతకూ బిడ్డ ఏడవక సుఖంగా నిద్రపోతున్నది.

చివరకు విసిగి భీమన్న ఆ బిడ్డను కొంచెంగా గిల్లి, అది ఏడుస్తుంటే పారిపోయే



దయ్యాలను చూడటానికి గబగబా బయటికి వెళ్ళి చెట్టుచాటున దాక్కున్నాడు.

ఎంత గాఢ నిద్రలో ఉన్నా తల్లికి తన బిడ్డ ఏడుపు తెలుస్తుంది. దూరాన ఏడుస్తున్నప్పటికీ ఆ రోదన ధ్వని విని సిద్దప్ప భార్య చివాలున లేచి కూచున్నది. బిడ్డ తన పక్కన లేకపోవటం చూసి కంగారుగా భర్తను లేపింది.

క్షణంలో ఇంటిల్లి పాతీ కూడా లేచారు. దీపాలు తీసుకుని అందరూ తోట ఇంటి కేసి పరిగెత్తి రాసాగారు.

అదే సమయంలో భీమన్న దాక్కుని ఉన్న వేపుగా ఒక పందికొక్కు పారి

పోయింది. "దయ్యం! దయ్యం! చంపు! చంపు!" అంటూ భీమన్న కేకలు పెట్టి దాని వెంటపడ్డాడు. కాని పందికొక్కు ఏ పొదల మధ్యనో దూరి వాడికి చిక్కకుండా తప్పించుకు పోయింది.

బిడ్డ క్షేమంగా ఉన్నందుకు సిద్దప్పా, వాడి భార్యా సంతోషించారు. తరవాత అందరూ ఇంటికి తిరిగి వచ్చి ఎవరిమానాన వాళ్ళు నిద్రపోయారు.

మహలక్ష్మి మాత్రం అసలు జరిగిన దేమిటో భర్త నడిగి తెలుసుకున్నది.

"ఇలా చేస్తే దయ్యాలు పారిపోతాయా? ఈ పని చేస్తున్నానని నాతో మాట మాత్రం చెప్పకూడదా?" అన్నదామె.

"నువు దయ్యాల ఊసే ఎత్తవద్దన్నావు. అందుచేత నీతో చెప్పలేదు. అయితే, దయ్యాలు బిడ్డ ఏడిస్తే పారిపోతాయని పెద్దలు చెప్పిన మాట అబద్ధమా?" అని భీమన్న భార్యను అడిగాడు.

ఈ మాటకు ఏం జవాబు చెప్పాలో తెలియక మహలక్ష్మి, "నిజమే అనుకోండి. బిడ్డలు వాళ్ళంతట వాళ్ళు ఏడిస్తే దయ్యాలు పారి పోతాయిగాని మనం కావాలని గిల్లి ఏడిపిస్తే పోవు," అన్నది.

భీమన్న కొంచెం ఆలోచించి, "మరి నేను దయ్యం పారిపోవటం చీకట్లో చూశానే? దాని కేమంటావు?" అన్నాడు.

"అది ఏ ఎలుకో, పందికొక్కో అయి ఉంటుంది," అన్నది మహలక్ష్మి.

భీమన్న కూడా అంతే అయి ఉండవచ్చు ననుకున్నాడు.

కాని మర్నాడు ఆ చుట్టుపక్కలంతా గొప్పగా చెప్పుకున్నారు—సిద్దప్ప బిడ్డను రాత్రి దయ్యా లెత్తుకుపోయి తోట ఇంట్లో పెడితే జమీందారుగారి అల్లుడు భీమన్న వాటితో హోరాహోరి పోట్లాడి బిడ్డను రక్షించాడని!

[పై నెల మరొక సంఘటన]





ముక్కుసూటిగా

జమీందారుగారి గ్రామానికి పది మైళ్ళ దూరంలో శ్రీపురం అనే గ్రామంలో దేవీ నవరాత్రులు జరిగేటప్పుడు అమ్మవారి దేవాలయంలో జమీందారుగారి తరఫున కూడా అర్చన జరగటం రివాజు. అర్చన చేయించటానికి జమీందారుగారు స్వయంగా వెళ్ళకపోయినా ఎవరినో ఒకరిని పంపుతూండే వారు. ఆ పని ఈసారి భీమన్న పైన పడింది.

"భీమన్నా, ఇవాళ నువ్వు బండిలో శ్రీపురానికి వెళ్ళి మన పేర అమ్మవారికి అర్చన చేయించి సాయంకాలానికల్లా తిరిగి రావాలి," అని జమీందారుగారు అల్లుడితో చెప్పాడు. బండీలో పళ్ళూ, టెంకాయలూ, ఇతర పూజా ద్రవ్యాలూ పెట్టారు. భీమన్న ఎక్కి కూచున్నాడు. బండి కదిలింది.

కొంతదూరం వెళ్ళినాక బండివాడు బండి నిలిపి, "బాబూ, ఒక్క క్షణం ఉండండి. ఇప్పుడే మా యింటికి వెళ్ళి నేను కూడా ఒక టెంకాయ తెచ్చి అమ్మవారికి కొడతాను," అని కొంత దూరంలో ఉన్న తన ఇంటి కేసి పరిగెత్తాడు.

భీమన్న ఎన్నడూ బండి తోలలేదు. బండివాడు వెంటనే వస్తానన్నాడుగదా, బండిని నింపాదిగా నడిపిద్దామనుకుని భీమన్న పగ్గాలు ఒక చేత పట్టుకుని, రెండో చేత్తో చరణాకోల పుచ్చుకుని ఎడ్లను అదిలించాడు. ఎద్దులు వేగంగా కదిలాయి. "మెల్లిగా! మెల్లిగా!" అని భీమన్న అంటున్నా అవి వినిపించుకో లేదు. భీమన్నకు కోపం వచ్చి చరణాకోలతో ఎద్దులను గట్టిగా వేశాడు. అవి మరింత వేగంగా పరిగెత్తాయి. వాటి పరుగు హెచ్చిన కొద్దీ భీమన్న కోపం కూడా హెచ్చింది. అతను అరిచాడు, ఎడ్లను చావ గొట్టాడు. దారీ తెన్నూ చూడకుండా అవి గుర్రాలతో



సమంగా దౌడు తీశాయి. శ్రీపురం దారి ఎటో, బండి ఎటుకేసి పోతున్నదో కూడా భీమన్నకు తెలియరాలేదు.

అంతలో భీమన్నకు పగ్గాలు బిగలాగాలని తట్టింది. బండిని ఆప దలిచినప్పుడు బండివాడు పగ్గాలు లాగి, "హో! హో! హో!" అంటాడని భీమన్నకు గుర్తు వచ్చింది. అదే ప్రకారం భీమన్న కూడా పగ్గం గట్టిగా బిగలాగి, "హో! హో! హో!" అన్నాడు. దురదృష్టవశాత్తూ భీమన్న ఒకే పగ్గం లాగటం చేత ఎద్దులు పక్కకు తిరిగి, దారి పక్కనే ఉన్న కాలవలోకి తిన్నగా దిగి ఆగిపోయాయి.

అంత దూరాన కాలవలో బట్టలు ఉతుకుతూన్న చాకలి ఒకడు ఇదంతా చూసి పరిగెత్తుకుంటూ వచ్చి, "ఏం బాబూ? బండిని కాలవలోకి తోలేశారేమిటి?" అని భీమన్నను అడిగాడు.

"కావాలనే తోలాను! కళ్ళు కనిపించటం లేదా? ఎడ్లకు దప్పిక అయింది. నీళ్ళు తాగుతున్నాయి చూడు," అన్నాడు భీమన్న.

భీమన్న మాట పూర్తి కాకుండానే ఎద్దులు నీళ్ళు తాగటం మానేశాయి. బండిని కాలవలో నుంచి బాట మీదికి ఎక్కించటం భీమన్నకు సాధ్యం కాలేదు. చాకలివాడే సహాయం చేసి బండిని దారి మీదికి తెచ్చాడు.

"చూడూ! శ్రీపురానికి దారి ఎటూ?" అని భీమన్న చాకలిని అడిగాడు.

"శ్రీపురానికి వెళ్ళే పనయితే ఇటు రానే కూడదు. ఈ దారిన తిన్నగా వెనక్కు పోతే కొంతదూరం వెళ్ళినాక అడ్డంగా రహదారి తగులుతుంది. కుడివైపు తిరిగి ముక్కుసూటిగా పోతే శ్రీపురం వస్తుంది," అన్నాడు చాకలి. భీమన్నకు సందేహం వచ్చింది. "ముక్కు సూటిగా అంటే ఎవరి ముక్కుకు సూటిగా? నా ముక్కుకా? ఎద్దుల ముక్కుకా?" అని అతను చాకలిని అడిగాడు.

భీమన్న వ్యవహారం చాకలికి అర్థ మయింది. "నువ్వయితే అటూ ఇటూ తిరుగుతావు. ఎద్దులయితే ఎటూ తిరగ కుండా ముక్కు సూటిగా పోతాయి," అన్నాడు వాడు భీమన్నతో.

ఈ మాటతో భీమన్నకు తృప్తి కలిగింది. అతను బండిలో చేరగిలబడి కూచుని ఎద్దులతో, "ముక్కు సూటిగా వెళ్ళండి," అని చెప్పాడు. ఆ తరవాత కొద్ది సేపటికే బండి ఊపుకు భీమన్నకు సుఖంగా నిద్రపట్టింది. ఎద్దులకు తోలేవాడి అజమాయిషీ లేకపోయే సరికి, అవి నిశ్చింతగా ఇంటి దారి పట్టాయి.

ఆ సాయంకాలం భీమన్న భార్య మహలక్ష్మి ఊరి దేవాలయానికి వెళుతూ తన భర్త వెళ్ళిన బండి ఎదురు వస్తూండటం గమనించింది. మొదట ఆమె తన భర్త పని పూర్తి చేసుకుని శ్రీపురం నుంచి తిరిగి వస్తున్నాడనుకుంది. కాని తీరా బండి సమీపానికి వచ్చాక బండి వెంట తోలేవాడు లేక పోవటమూ, బండిలో తన భర్త నిద్ర పోతూండటమూ, పళ్ళూ, కొబ్బరికాయలూ, పూజాద్రవ్యాలూ బండిలోనే ఉంటమూ ఆమెకు కనిపించింది. ఆమె ఎద్దులను ఆపి, భర్తను తట్టి లేపి, "మీరు శ్రీపురం వెళ్ళ లేదా?" అని అడిగింది.



భీమన్న నిద్రలేస్తూనే, "శ్రీపురం వచ్చిందా?" అన్నాడు. తరవాత భార్యను చూసి ఆశ్చర్యపోయి, ఆమెతో జరిగినదంతా చెప్పాడు. అంతా విని మహలక్ష్మి భీమన్నతో, "అయిందేదో అయింది. ఇవాళకు మన ఊరి ఆలయంలోనే అర్చన జరిపింతాం. రేపు శ్రీపురానికి నేనుకూడా వస్తాను," అని చెప్పింది.

ఇద్దరూ కలిసి దేవాలయంలో అర్చన జరిపి ప్రసాదంతో ఇంటికి తిరిగి వచ్చారు. ఉదయమనగా మరొక గ్రామం వెళ్ళిన జమీందారు పొద్దుపోయి ఇంటికి వచ్చాడు. మహలక్ష్మి తన తండ్రికి ప్రసాదం ఇస్తూ,


"పొద్దున మన బండివాడు మధ్య దారిలో బండి ఆపి ఎటో వెళ్ళి ఎంతకీ రాకపోతే మీ అల్లుడుగారు తానే బండి తోలుకుని శ్రీపురం వెళ్ళి అర్చన చేయించి వచ్చారట. అక్కడ ఎంతో వైభవంగా ఉందట. రేపు నన్నుకూడా తన వెంట రమ్మంటున్నారు," అని చెప్పింది.


అంతలోనే బండివాడు కూడా వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. వాడు మాట్లాడక మునుపే మహలక్ష్మి వాడి మీద విరుచుకుపడి, "అయ్యగార్ని వదిలేసి మధ్య దారిలో అంతసేపు ఎక్కడికెళ్ళావురా, పశువా? చూసి చూసి ఆయన వేళ మించి పోతుందని స్వయంగా బండి తోలుకెళ్ళారు, తెలుసా? ఇలాగేనా నువ్వు పని చేసేది?" అని వాణ్ణి గదమాయించింది.

"నేను అప్పుడే తిరిగొచ్చా నమ్మగారూ. బండి జాడే లేదు. అప్పుడు కాలి నడకన శ్రీపురం వెళ్ళా. అక్కడ బండిగాని, అయ్యగారు గాని కనిపించ లేదు," అన్నాడు బండివాడు.

"నువ్వు అప్పుడే తిరిగొచ్చి ఉంటే బండి ఎందుకు మాయమవుతుందీ? నువ్వు కాళ్ళీడ్చుకుంటూ శ్రీపురం చేరేసరికి అయ్యగారు అర్చన ముగించి తిరుగుదారి పట్టి ఉంటారు," అన్నది మహలక్ష్మి.

"దారంతా చూశానమ్మగారూ—" అని బండివాడు అంటుంటే, మహలక్ష్మి వాణ్ణి మాట్లాడ నివ్వక, "ఏడవలేక పోయావు. ఇవాళ అయిందేదో అయింది. రేపు మేమిద్దరమూ మళ్ళీ శ్రీపురం వెళుతున్నాం. పెందలాడే బండి సిద్ధం చేసి తీసుకురా!" అన్నది. తన కొక పెద్ద గండం తప్పినట్టుగా సంతోషించాడు, బండివాడు. మర్నాడు భీమన్న వెంట మహలక్ష్మికూడా వెళ్ళి, శ్రీపురంలో అర్చన జయప్రదంగా చేయించింది. ఇద్దరూ సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చారు. [పై మాసం మరొక సంఘటన]





ఎవరుపెట్టాలి? ఎవరుతినాలి?

భీమన్న చేత అవమానం పొందిన వెంకటప్ప తాచుపాములాటి స్వభావం కలవాడు. భీమన్న పైన ప్రతీకారం చెయ్యాలని వాడికి బాగా పట్టుకున్నది. జమీందారుగారి ఇంటి నుంచి తనను భీమన్న సాగనంపిన పద్ధతి ఊరంతా తెలిసిపోయింది. ఇక తాను ఊళ్ళో తల ఎత్తుకు తిరగటం సాధ్యంకాదు.

అందుచేత వెంకటప్ప తన కొడుకును సుబ్బన్నను పిలిచి, "ఒరే, నేను కొంత కాలం పొరుగూరులో ఉండి వస్తాను. ఈలోగా నువ్వు భీమన్నను అత్తవారింటి నుంచి వెళ్ళగొట్టాలి. జమీందారు పైనా, భీమన్న పైనా నా పగ తీరాకనే నేను మళ్ళీ ఈ ఊళ్ళో అడుగు పెట్టటం," అన్నాడు.

"ఏం చెయ్యాలో చెప్పు, నాన్నా. నువ్వు చెప్పినట్టే చేస్తాను," అన్నాడు సుబ్బన్న.


వాడికి తండ్రి రహస్యంగా చెయ్యవలసినది చెప్పి పొరుగూరికి వెళ్ళిపోయాడు.

సుబ్బన్నకూ భీమన్నకూ కొద్దిపాటి స్నేహం ఉన్నది. అందుచేత వాడు భీమన్న దగ్గిరికి వెళ్ళి, "జమీందారుగారి అల్లుడు కావటం నీకెంత అపకారమయిందో తెలుసా? ఊళ్ళో అందరూ నిన్ను చూసి హేళన చేస్తున్నారు," అన్నాడు.

"హేళన చెయ్యటానికి నేనేం చేశాననీ?" అని భీమన్న అడిగాడు.

"ఏమీ చెయ్యక పోవటమే నీ లోపం! పరువైన మగవాడెవడూ భార్య పెడితే తింటూ కూచోడు. ఏదైనా పని చేసి, తాను తిని భార్యకు పెడతాడు. నువ్వు అలా చెయ్యక నీ భార్య వండి వడ్డిస్తే తింటూ కూచున్నావు. నీలాటి వాణ్ణి చూసి అందరూ నవ్వుతారు మరి," అన్నాడు సుబ్బన్న.

సుబ్బన్న చెప్పినట్టు తాను భార్య వడ్డిస్తే తినటమే కాని భార్యకు ఏనాడూ భోజనం పెట్టలేదు. ఏనుగుకున్నంత బలం ఉండి



కూడా తాను పనీపాటూ చెయ్యని మాటా నిజమే. అలా ఉండటం పరువైన సంగతి కాదని సుబ్బన్న చెబుతున్నాడు. నిజమే అయి ఉండాలి. అందుకే చిన్నప్పుడు బామ్మ తన చేత పని చేయించటానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. చేసేటందుకు పని దొరక్కపోదు. వంట చెయ్యటం బామ్మ దగ్గిర నేర్చుకుని వస్తే, ఆ తరవాత ఏదో ఒక పని సంపాదించి, తానుకూడా పరువుగా తన భార్యకు తిండి పెట్టవచ్చుననుకున్నాడు భీమన్న.

భీమన్న మహలక్ష్మితో, "నేను మా బామ్మ దగ్గిరికి వెళ్ళి వస్తాను," అన్నాడు.

"ఏమిటి విశేషం?" అని మహలక్ష్మి అడిగింది.

"వంట చేయటం నేర్చుకోవాలి," అన్నాడు భీమన్న.

"వంట నేర్చుకోవాలని సరదాగా ఉంటే నేను నేర్పుతాగా?" అన్నది మహలక్ష్మి పెద్దగా నవ్వుతూ.

"అది పరువుగా ఉండదు. నేను వంట నేర్చుకున్న దాకా ఈ వూళ్ళో ఉండరాదు. అందరూ నన్ను చూసి నవ్వుతున్నారు," అన్నాడు భీమన్న.

తన భర్త తలలో ఏదో వెర్రి ఆలోచన తల ఎత్తిందని గ్రహించి మహలక్ష్మి అతన్ని ప్రశ్నించింది. ఆ ప్రశ్నల కన్నిటికీ సమాధానాలు చెబితే ఆమె తన ప్రయత్నం కాస్తా పడగొట్టుతుందనుకుని భీమన్న, "నన్నేమీ అడగకు. నా పని ముగించుకుని గాని నేను ఈ ఊళ్ళో అడుగు పెట్టను," అన్నాడు.

మహలక్ష్మి మాట్లాడక ఊరుకుని అతన్ని వెళ్ళిపోనిచ్చింది. అల్లు డెక్కడ అని జమీందారుగా రడిగితే, "వాళ్ళ బామ్మను చూసి వస్తానని వెళ్ళారు," అని చెప్పింది.

భీమన్న బయలుదేరి భోజనాల వేళకు ఒక గ్రామం చేరాడు. జమీందారుగారి అల్లుడు వచ్చాడు గదా అని గ్రామపెద్ద


అతనికి తన యింట ఆతిథ్యమిచ్చాడు. గ్రామపెద్దతోబాటు భీమన్న కూచున్నప్పుడు గ్రామపెద్ద భార్య వడ్డన చేసింది. భోజనం చేస్తూ భీమన్న, "మీ ఇంట్లో వంట ఎవరు చేస్తారు?" అని అడిగాడు.

"నా భార్యే చేస్తుంది. వంట బాగా లేదా?" అని గ్రామపెద్ద భీమన్నను అడిగాడు.

"చాలా బాగుంది. ఎప్పుడూ ఆమే చేస్తారా? మీరు చెయ్యరా? ఆ మాట తెలుసుకోవటానికి అడిగాను," అన్నాడు భీమన్న. గ్రామపెద్ద ఆశ్చర్యంతో, "నేను వంట చెయ్యటమా? ఎన్నడూ లేదు. నా కసలు వంట చెయ్యటమే రాదు," అన్నాడు.

భీమన్నకు ఆశ్చర్యమయింది: "గ్రామ పెద్ద అయి ఉండికూడా భార్యకు తిండి పెట్టక, భార్య పెడితే తింటున్నాడా?" అనుకున్నాడు.

అక్కడి నుంచి బయలుదేరి భీమన్న ఆ రాత్రికి మరొక గ్రామం చేరాడు. అక్కడి గ్రామాధికారి భీమన్నకు ఆతిథ్యమిచ్చాడు. ఇక్కడకూడా అలాగే జరిగింది. గ్రామాధికారి భార్య వడ్డించింది. తనకు వంట చాత కాదనీ, తానెప్పుడూ వంట చెయ్యలేదనీ, కాపరానికి వచ్చిన నాటి నుంచీ తన భార్యే



రెండు పూటలా వంట చేస్తున్నదనీ గ్రామాధికారి స్పష్టంగా చెప్పాడు.

భీమన్నకు మండిపోయింది. సుబ్బన్న తనతో ఎందుకు అబద్ధం చెప్పాడు? ఆ సంగతి ముందు తేల్చుకోవాలి!

భీమన్న బొమ్మను చూసే ప్రయత్నం కట్టిపెట్టి, మర్నాడు తెల్లవారుజామునే లేచి తన ఊరికి తిరిగి వెళ్ళి, తిన్నగా సుబ్బన్న ఇంటికి పోయాడు. అప్పుడే సుబ్బన్న భోజనానికి కూచున్నాడు, వాడి భార్య వడ్డన చేస్తున్నది.

"ఏమిరా, సుబ్బన్నా? నాతో అబద్ధ మాడతావా? మగవాళ్ళెవరూ భార్యలకు

వండిపెట్టటం లేదు. నేను చూసి వచ్చాను. ఆఖరుకు నువు కూడా నీ భార్య వడ్డిస్తేనే తింటున్నావు గాని నీ భార్యకు తిండి పెట్టటం లేదు. నన్ను హేళన చేసిన వాళ్ళెవరో చూపించు," అని భీమన్న సుబ్బన్నను గద్దించి అడిగాడు.

"నే నన్నది అది కాదు, భీమన్నా—" అని సుబ్బన్న ఏదో చెప్పబోయేసరికి భీమన్న, "పరువు గల మగవాళ్ళందరూ భార్యలకు తిండి పెడతారని నువు చెప్ప లేదా? ఇప్పుడు మాట మార్చుతున్నావా?" అంటూ సుబ్బన్న జుట్టు పట్టుకున్నాడు. భీమన్న తనను చంపేస్తాడని భయపడి సుబ్బన్న కేకలు పెట్టాడు.

చుట్టుపక్కల వాళ్ళంతా చేరారు. సంగతంతా విని వాళ్ళు భీమన్నతో, "సుబ్బన్న మాటకు అర్థం, మొగుడు భార్యను పోషించటానికి ఏదన్నా ఉద్యోగం చెయ్యాలని," అని నచ్చ చెప్పారు.

"సుబ్బన్న అట్లా చెప్పగూడదూ? పెళ్లాలకు తిండి పెట్టాలనటం దేనికీ? ఉద్యోగం చెయ్యాలంటే సరిపోయేది కదా?" అని రుసరుసలాడుతూ ఇంటికి వెళ్ళాడు భీమన్న.

మహలక్ష్మి భీమన్నతో "మీ బామ్మగారి ఊరు వెళ్ళలేదా?" అన్నది.

"ఆ సుబ్బన్న నాతో అబద్ధాలు చెప్పాడు. నేను వంట నేర్చుకో నక్కర్లేదుట. ఉద్యోగం చెయ్యాలిట!" అన్నాడు భీమన్న.

"జమీందారీ వ్యవహారాలు చూడటం ఉద్యోగం కాదా? లేనిపోని అనుమానాలన్నీ పెట్టుకోక భోజనానికి లేవండి, వడ్డిస్తాను," అన్నది మహలక్ష్మి.

మహలక్ష్మికి తాను వండి పెట్టనవసరం లేకుండా, ఆమె వంట తాను తినవచ్చు గదా అని పరమానందం పొంది భీమన్న భోజనానికి లేస్తూ, "ఇక నుంచీ జమీందారీకి సంబంధించిన పనులన్నీ నాకు చెప్పు. నేనే చేసేసి పరువు సంపాదిస్తాను," అన్నాడు.





పొడుపు కథ

భీమన్న మామగారి జమీ వసంతదేశంలో ఉన్నది. ఆ దేశపు యువరాజుగారు ఒక సందర్భంలో పర్యటన చేస్తూ ఆ వైపులకు రావటం తటస్థించింది. వారు జమీందారు గారి ఇంట ఒక రోజు అతిథిగా ఉంటారని ముందుగా కబురు వచ్చింది.

జమీందారుగారు యువరాజాగారి ఆతిథ్యం కోసం ఘనమైన ఏర్పాట్లు చేయించారు. ఈ ఏర్పాట్లు అమలు చెయ్యటానికి అనేకమంది మనుషులను నియోగించారు. యువరాజాగారి భోజన స్నాన పానాదుల ఏర్పాట్లు చూసే పని మహాలక్ష్మి పైన పడింది. యువరాజాగారు వచ్చి చేరగానే ఆయనకు ఎదురు వెళ్ళి, స్వాగతం చెప్పి యింటిలోపలికి తీసుకు వచ్చే పని భీమన్నకు ఇచ్చారు.

భీమన్నతో జమీందారుగారు, "యువరాజాగారు నీ వయసువాడు, నిన్నే పోలి ఉంటాడు. నేనేమో ముసలివాణ్ణి. నేను స్వాగతం చెప్పేకన్న నీవు చెప్పటం చాలా ఉచితంగా ఉంటుంది. యువరాజావారు కూడా చాలా సంతోషిస్తారు," అన్నాడు.


యువరాజాగారిని చూడగానే ఎలా నమస్కరించాలో, ఎలా స్వాగతం చెప్పాలో, ఎలా కుశల ప్రశ్న చెయ్యాలో జమీందారు గారు అల్లుడికి చక్కగా నూరి పోశారు. ఈ పని అయినాక భీమన్నకు తగిన దుస్తులు వేశారు. చమ్కీ లాగూ, చమ్కీ అంగరఖా, నెత్తి మీద చమ్కీ టోపీ, మెడలో పూసల దండలూ భీమన్న చేత ధరింప జేసి అతన్ని సిద్ధపరిచారు.

ఎప్పుడు యువరాజా వస్తాడా, ఎప్పుడు స్వాగతం చెబుదామా అని తహతహ లాడుతూ భీమన్న కాలు గాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరుగుతూ, తన కొత్త దుస్తులకు శరీరాన్ని అలవాటు చేసుకోసాగాడు.

ఇలాపచారు చేస్తూ భీమన్న హాలులోకి అడుగు పెట్టి ఆశ్చర్యంతో నిలిచిపోయాడు. ఎందుకంటే ఎదురుగా ఉన్న వాకిట యువ రాజాగారే కాబోలు నిలబడి కనిపించాడు.

"అరె, అప్పుడే వీరు రావటమూ, లోపల ప్రవేశించటమూ అయిపోయిందే! ఇప్పుడేం చెయ్యటం?" అని భీమన్న ఆలోచిస్తూ బిత్తరబోయి నిలబడి ఉండగా, ఆ ఎదటి వాకిట నుంచి లక్ష్మి వచ్చి, యువరాజా మీద ఎడమ చెయ్యివేస్తూ, "మీరిక్కడ నిలబడి ఏం చేస్తున్నారు?" అని అడిగింది.

అయితే మహాలక్ష్మి యువరాజాగారి మీద వేసిన చెయ్యి తన భుజం మీద పడేసరికి భీమన్న ఒక్క క్షణం బిత్తరపోయి నిజం తెలుసుకున్నాడు. అతను చూసినది యువ రాజా కాదు; అది తన ప్రతిబింబమే. తాను చూసిన చోట వాకిలి లేనేలేదు, ఎదురుగా ఉండే వాకిలి పెద్ద నిలువు టద్దంలో ప్రతి బింబించింది. కొత్త దుస్తులు ధరించి ఉండటంచేత భీమన్న తన రూపు తానే పోల్చుకోలేక పోయాడు. అదీగాక ఆ నిలువుటద్దం మామూలుగా అక్కడ ఉండదు. యువరాజాగారు వస్తున్నారుగదా అని దాన్ని ఏ సామానుల గదిలోనుంచో పైకి తీయించి, కడిగి తుడిచి హాలులో అమర్చారు.




భీమన్న మహాలక్ష్మి అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పే లోపుగా యువరాజాగారి పరివారం సమీపిస్తున్న అలికిడి అయింది. అందరూ ఎవరి స్థానాలలో వారు నిలబడ్డారు. యువరాజాగారు ఇంటి ముందు గుర్రం దిగగానే భీమన్న ఎదురు వెళ్ళి, "దయ చెయ్యాలి, ధర్మ ప్రభువులు!" అన్నాడు. మిగిలిన కార్యకర్త లందరూ తమ తమ పనులను సక్రమంగా చేసేశారు. ఏ విషయంలోనూ ఎలాటి లోపమూ జరగలేదు.

యువరాజా మంచి మాటకారి, తాను చాలా తెలివిగల వాణ్ణని అనుకుంటాడు. భీమన్నకూ అతనికీ దోస్తీ బాగానే కలిసింది.

భోజనాలు అయాక అందరూ హాలులో కూచున్నారు. గ్రామంలోని పెద్దలు చిన్న సభలాగా కొలువు తీరారు. యువరాజాగారు చాలాసేపు సామాన్య విషయాలనే అత్యాశ్చర్యకరమైనవిగా చెప్పాడు. అందరూ మర్యాద కోసం నోళ్ళు తెరిచి ఆలకిస్తూ, అవసరమైనప్పుడల్లా ఆశ్చర్యం అభినయించారు.

"ఈ పల్లెటూరి మొద్దుల తెలివి తేటలు చూస్తాం," అనుకుని యువరాజా పొడుపు కథలు వెయ్యసాగాడు.

యువరాజా వేసే పొడుపుకథలు అందరికీ తెలిసినవే. అందుచేత ఆయన పొడుపు కథ



వేసినప్పుడల్లా గ్రామపెద్దల్లో ఎవరో ఒకరు సమాధానం చెబుతూ వచ్చారు.

భీమన్న ఈ సంభాషణను ఆలకించటం మాని నిలువుటద్దంలో కనిపించే చోద్యం గురించే ఆలోచిస్తూ, తనకే తెలియకుండా, "ఒకటి రెండు చేస్తుంది, కుడిని ఎడమ చేస్తుంది. ఏం చిత్రం!" అనేశాడు.

భీమన్న అన్న మాటలు విన్న యువరాజా అది కూడా ఒక పొడుపు కథే అనుకుని, "ఇది నే నెప్పుడూ వినలేదే! ఏమిటది?" అని అడిగేశాడు.

భీమన్న వేసిన పొడుపుకు సమాధానమేమిటో ఎవరికీ తెలీదు. అందరూ అతని కేసి ఆశ్చర్యంగా చూశారు.

తాను అన్నమాటలు ఒక పొడుపు కథ అయినందుకు భీమన్న లోలోపల సంతోషించి, "ఒకటి రెండు చేస్తుంది, కుడిని ఎడమ చేస్తుంది. ఏమిటది?" అని మరొక సారి గట్టిగా అన్నాడు.

"నాకు తెలీదు," అన్నాడు యువరాజా, ఎంతో ఆశ్చర్యం కనబరుస్తూ.

"మాకూ తెలీదు," అన్నారు మిగిలిన గ్రామపెద్దలంతా.

భీమన్న నవ్వి నిలువుటద్దం కేసి చూపుతూ, "అద్దం!" అన్నాడు.

అందరూ హర్షధ్వానాలు చేశారు. యువరాజా కూడా సంతోషించి, "భేష్! ఈ కొత్త పొడుపు అందరికీ వేస్తాను. ఎవరూ చెప్ప లేరు!" అని ప్రకటించాడు.

అక్కడ ఉన్న వారందరికీ భీమన్న పైన గొప్ప అభిప్రాయం ఏర్పడింది. యువరాజా గారు డజన్ల కొద్దీ పొడుపులు వెయ్యటమూ, వాటికి పసి పిల్లలు కూడా జవాబు చెప్పటమూ, జమీందారుగారి అల్లుడుగారు ఒక్క పొడుపు వేసేసరికి యువరాజా వారు కళ్ళు వెళ్ళ బెట్టటమూ గురించి జనం ఎన్నో ఏళ్ళపాటు చెప్పుకున్నారు.

[పై నెల మరొక సంఘటన]





మొదలాడిన హరికథ

భీమన్న భార్య మహలక్ష్మి తొలిచూలు గర్భవతి అయి సకాలంలో మగ పిల్లవాణ్ణి కన్నది. జమీందారుగారికి మనవడు పుట్టాడని ఊరంతా సంబర పడ్డారు. ఇక భీమన్న సంతోషానికి మేరే లేదు. అటు వచ్చీ, ఇటు వచ్చీ పురిటి పిల్లవాణ్ణి చూసి అతను తెగ మురిసి పోయేవాడు.

ఒకరాత్రి పురిటి గదిలో పిల్లవాడు అకారణంగా పోరు పెట్టి ఏడవసాగాడు. వాడి ఏడుపు మాన్పటానికి మహలక్ష్మి ఏమి చేసినా ప్రయోజనం లేకపోయింది.

ఇంతలో గుండు భీమన్నకు ఒక విషయం జ్ఞాపకం వచ్చింది; పిల్లలు అకారణంగా ఏడిస్తే దయ్యాలు పారిపోతాయిట. దయ్యం ఎటుగా పారిపోతుందో చూద్దామని భీమన్న మిద్దె మీదికి ఎక్కి నాలుగు వైపులా పరికించి చూడసాగాడు. ఆ సమయంలో సామాన్ల కొట్టు వేపు నుంచి తపాతపా మంటూ శబ్దం విన వచ్చింది. ఒక ఎలుక ప్రమాదవశాన ఒక కాళీ జాడీలో పడి, పైకి రావటానికి ఎగిరి మళ్ళీ మళ్ళీ లోపలే పడుతున్నది. అదే భీమన్న విన్న శబ్దం.

కాని భీమన్నమటుకు దయ్యమే జాడీలో దాగి చప్పుడు చేస్తున్నదనుకుని, జాడీని తన పై పంచతో కప్పి, జాడీని అలాగే ఎత్తుకుని తోటకు వెళ్ళి, అక్కడ జాడీని పక్కకు పంచి, "ఏయ్, దయ్యమా! ఇదే నీ చోటు. ఇక్కడే ఉండు. ఈమారు ఇంటి కేసి వచ్చావో నిన్ను మారణహోమం చేయిస్తాను," అని అరిచాడు.

జాడీలో ఉన్న ఎలుక ప్రాణాలతో బయట పడ్డందుకు సంతోషిస్తూ, చీకటిలో ఎటో పారిపోయింది.

భీమన్న ఎంతో గొప్ప ఘనకార్యం చేసినవాడిలాగా ఇంటికి తిరిగి వచ్చేసరికి పురిటి పిల్లాడు ఏడుపు మానేశాడు.


భీమన్న తన భార్య వద్దకు పోయి, "చూశావా, మన అబ్బాయి అకారణంగా ఏడిచే సరికి దయ్యం కాస్తా పారిపోయింది. దాన్ని జాడీలో బంధించి తీసుకుపోయి తోటలో వదిలేశాను," అన్నాడు.

"పిల్లవాడు అకారణంగా ఏమీ ఏడవ లేదు. వాడికి చీమ కుట్టింది. మీరు ఏ ఎలుకనో పట్టుకుపోయి ఉంటారు. దయ్యమూ లేదు, భూతమూ లేదు," అన్నది మహలక్ష్మి.

ఆమె ఆ మాట అన్నాక భీమన్నకు కూడా జాడీలో నుంచి పారిపోయినది ఎలుక రూపంలో ఉండినట్టే అనిపించింది. అతను తన భార్య తెలివి తేటలకు ఎంతో ఆశ్చర్యపోయాడు.

జమీందారుగారు తన మనవడి బారసాలకు అందరికీ ఆహ్వానాలు పంపి, వచ్చే అతిథుల కోసం రోజు కొక వినోదం ఏర్పాటు చేశాడు.

రేపు బారసాల అనగా సాయంత్రంవేళ హరికథ ఏర్పాటయింది. పందిట్లో హరిదాసు గారు హరికథ ప్రారంభించాడు. ఊళ్ళో వాళ్ళు చాలామంది కథ వినటానికి వచ్చారు. పిల్ల లందరూ చేరి కేకలు పెట్టి అల్లరి చేస్తున్నారు.



తన గదిలో కూచుని కాగితాలు చూసు కుంటున్న జమీందారుగారికి హరికథ కన్న పిల్లల అల్లరి హెచ్చుగా వినవస్తున్నది. అందుచేత ఆయన ఒక నౌకరును పిలిచి, "ఆ పందిట్లో చేరినవాళ్ళకు అల్లరి చెయ్యక కథ వినమని చెప్పు," అని పంపాడు.

పనివాడు వెళ్ళి, "అల్లరి చెయ్యకండి, బాబో! అయ్యగారు కోప్పడుతున్నారు!" అని ఎంత అరిచినా ఎవడూ వినిపించుకో లేదు. అప్పుడు జమీందారుగారు భీమన్నతో, "అబ్బాయీ, నౌకర్లమాట వినేటట్టు లేరు, ఆ పందిట్లో మూకను నిశ్శబ్దంగా ఉండమని కేక వేసి రా!" అన్నాడు.

భీమన్న పందిట్లోకి వెళ్ళి, "అరవకండి! నిశ్శబ్దం! ఎవరన్నా నోరు మెదిపారంటే బయటికి విసిరేస్తాను!" అని రంకెలు పెట్టాడు. వెంటనే అంతా సద్దు మణిగింది.

ఇంతసేపటికి సభికులు ఒక దారికి వచ్చినందుకు సంతోషిస్తూ హరిదాసుగారు మేళతాళాలతో ఒక పాట ఎత్తుకున్నాడు.

లోపలికి వెళ్ళిపోతున్న భీమన్న గిరుక్కున వెనక్కు తిరిగి, హరిదాసుతోనూ వాద్య బృందంతోనూ, "మీకు వేరే చెప్పాలా ఏమిటి? నిశ్శబ్దంగా ఉండమంటే మీకు కాదూ? చీమ చిటుక్కు మనటానికి వీల్లేదు, అంతే!" అన్నాడు.

హరిదాసుగారు కొయ్యబారిపోయాడు. ఆయన కేం చెయ్యాలో తెలియలేదు. కథ వినటానికి చేరినవారిలో పెద్దలకు కూడా అల్లుడుగారి ధోరణి అర్థం కాలేదు. వినేవాళ్ళను గప్‌చుప్‌గా ఉండమనటంలో అర్థం ఉన్నదిగాని, హరిదాసుగారినీ, వాద్యగాళ్ళనూ నిశ్శబ్దంగా ఉండమనటంలో అర్థమేమిటీ? అదృష్టవశాత్తూ అదే క్షణంలో బామ్మ బండి దిగి లోపలికి వచ్చింది.

"ఓహో, బామ్మ వచ్చిందే!" అన్నాడు భీమన్న పరమానందంతో. జమీందారుగారి నౌకర్లు బామ్మకు మర్యాదలు చేశారు.

మిగతా అతిథులకు భీమన్నపై కలిగిన అపోహ తొలగిపోయింది. బామ్మ వచ్చిందనే జమీందారుగారి అల్లుడుగారు హరికథ నిలుపు చేయించారు!

అంతేకాదు, హరిదాసుగారి అనుమానం కూడా తొలగిపోయింది. "ఆ వచ్చినవారు అల్లుడిగారి బామ్మగారా? ఇకనేం? వారి కోసం కథ మళ్ళీ ప్రారంభింతాం!" అన్నాడు హరిదాసుగారు.

బామ్మ లోపలికి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చి కూచోగానే హరికథ మళ్ళీ ప్రారంభమై, సవ్యంగా సాగిపోయింది.

(సమాప్తం)

